

ఉత్తరకాలువకు నీటి విడుదల తగ్గింపు



అనంతసాగరం : సోమశిల డ్యాంలో నీటిమట్టం పడిపోతుండటంతో ఉత్తర కాలువకు నీటిని కుదించారు. డ్యాంలో బుధవారం 11.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 600 క్యూసెక్కులు ఇస్తుండగా 50 క్యూసెక్కులకు కుదించారు. డెల్టాకు 1500, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రంజాన్ వేళలు ఇఫ్తార్ (గురువారం) : 6.22 | సహరి (శుక్రవారం) : 4.53

ఉష్ణోగ్రతలు నెల్లూరు : 34.0 25.4 | కావలి : 33.0 26.0 | కందుకూరు : 33.0 26.0 | ఆత్మకూరు : 32.0 20.0 | ఉదయగిరి : 34.0 22.0

'అధికార' దాసోహంపై

ఈసీ కన్నెర్ర!

● వలంటీర్లు, ఫీల్డు అసిస్టెంట్లపై వేటు



సంగం : ఎంపీపీ గదికి వేసిన తాళం

సంగం : అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతూ ప్రచారంలో పాల్గొంటున్న ఫీల్డు అసిస్టెంట్లు, వీఆర్వోలు, వలంటీర్లపై ఎన్నికల సంఘం కన్నెర్రజేసింది. విధుల నుంచి వారిని తొలగించడంతోపాటు పోలీస్‌స్టేషన్లలో కేసుల నమోదుకు ఉత్తర్వులు జారీ చేసింది. సంగం సచివాలయం-౩లో వలంటీరు నీరుకట్టు ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించి ఎమ్పీడీవో కార్యాలయంలోని ఎంపీపీ గదిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వలంటీరు జన్మదిన వేడుకలు జరుపుకున్న విషయం విదితమే. ఇది ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకమైనందున ఎన్నికల రిటర్నింగ్ అధికా మధులత ఆదేశాల మేరకు ఎంపీడీవో శేషగిరిరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి వలంటీరు ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే ఎంపీపీ గదికి ఎంపీడీవో తాళం వేశారు.

● **కలిగిరి :** ఈసీ ఆదేశాలను ధిక్కరించిన కలిగిరి సచివాలయ పరిధిలోని వలంటీరు కుట్టుబోయిన పవన్‌కుమార్‌ను సస్పెండ్ చేయడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఉదయగిరి ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. సదరు వలంటీరు వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

● **ఆత్మకూరు :** ఏఎస్‌పేట మండలం చౌటభీమవరం గ్రామంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీరుపై వల్లబ్ ప్రసాద్‌ను విధుల నుంచి తొలగించినట్లు రిటర్నింగ్ అధికారి మధులత తెలిపారు.

● **వరికుంటపాడు :** అధికార పార్టీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు ఉపాధి హామి పథకం క్షేత్రసహాయకులు, ఓ ఎండీయూ వాహన ఆపరేటర్‌పై బుధవారం వేటు పడింది. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అధికార దాసోహం కథనంపై ఉన్నతాధికారులు విచారించారు. పెద్దిరెడ్డిపల్లి, నార్త్‌కొండాయపాళెం, తూర్పుకొండారెడ్డిపల్లి వీఆర్వోలు ఏ సిసింద్ర, సీహెచ్ భాస్కర్, వై చెంచురెడ్డిలతో సహా కాంచెరువు గ్రామానికి చెందిన ఎండీయూ వాహన డ్రైవర్ నరసింహారావులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్వర్వులు అందాయి. అలాగే క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోనూ కేసు నమోదు చేయడం గమనార్హం.



విద్యా వెలుగుల

రత్నం ఇకలేరు!

అనారోగ్యంతో నెల్లూరులో మృతి

మాజీ ఉపరాష్ట్రపతి విచారం, ప్రముఖుల నివాళి

విద్యారంగానికే వన్నెతెచ్చి, లక్షలాదిమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన విద్యావేత్త రత్నం మాస్టారు ఇకలేరు. జిల్లా కీర్తిని దశదిశలా ఇనుమడింపచేసిన రత్నం విద్యాసంస్థల అధినేత కొర్రపాటి వెంకటరత్నం (కేవీ రత్నం 82) అనారోగ్యంతో బుధవా రం మధ్యాహ్నం కన్నుమూశారు. రాష్ట్రంలోనే తొలిసారిగా కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యను, క్రమశిక్షణతో కూడిన బోధనను విద్యార్థులకు అందించారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచితం గా విద్యనందించారు. ఆయన విద్యాసంస్థల్లో చదివిన ఎందరో నేడు ప్రపంచవ్యాప్తంగా అత్యున్నతస్థానాల్లో ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందుతున్న ఆ యన ఇటీవల కోలుకున్నారు. ఈ క్రమంలో బుధవారం మరోసారి తీవ్ర అస్వస్థతకు గురై హరనాథపురంలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్త విని ఎంతోమంది శిష్య బృందం శోకసంద్రంలో మునిగారు. పూర్వపు ఉపరాష్ట్రపతి వెంక య్యనాయుడు రాజకీయ నాయకులు, తదితరులు నివాళులర్పించారు.

- 7లో..



రత్నం భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు



రంగడి బ్రహ్మోత్సవాలు ఆరంభం

నెల్లూరు (సాంస్కృతికం) : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, ధ్వజపట పూజ, అంకురార్పణ, హోమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఒక మంత్రి.. ఒక మాజీ మంత్రి నేతృత్వంలో జిల్లాలో వందల కోట్ల విలువైన క్వార్ట్జ (తెల్లరాయి) సంపద కొల్లగొట్టబడుతోంది. అనుమతుల్లేని క్వారీల్లో ప్రతి రోజూ టన్నుల కొద్దీ తెల్లరాయి తరలిపోతున్నా జిల్లా యంత్రాంగానికి చీమకుట్టినట్లయినా లేదు. ఒకరు తాజా, మరొకరు మాజీ మంత్రుల సారథ్యంలో అధికార పార్టీ రౌడీల పర్యవేక్షణలో నిరాటంకంగా సాగుతున్న తవ్వకాలపై ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

కోడ్ కూసినా.. కళ్లు తెరవరేం!

యథేచ్ఛగా క్వార్ట్జ దోపిడీ

రూ.కోట్లు విలువైన ప్రజా సంపద లూటీ

మంత్రి కాకాణి, మాజీ మంత్రి అనిల్‌పై ఆరోపణలు



సైదాపురం మండలం జోగిపల్లిలో క్వార్ట్జ తవ్వకాలు

నెల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామ లెక్కదాఖలాలో సుమారు వంద ఎకరాల్లో క్వార్ట్జ తవ్వకాలు సాగుతున్నాయి. ఈ భూములు ప్రైవేటు వ్యక్తులవి కావు. పట్టా భూములూ కావు. రెవెన్యూ అటవీ శాఖలకు చెందిన భూమి. ఈ క్వారీకి లీజు ఉందా అంటే అదీనూ లేదు. ఈ క్వారీ లీజు కోసం ఇప్పటివరకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. కానీ తవ్వకాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికి సుమారు రూ.100 కోట్ల విలువైన క్వార్ట్జ ఎటువంటి అనుమతి లేకుండా, ప్రభుత్వానికి పైసా పన్ను కట్టకుండా చెన్నైకి తరలిపోయింది. గత రెండు నెలలుగా రోజుకు 30 లోడ్లకు తక్కువ లేకుండా జిల్లా సరిహద్దులు దాటించేస్తున్నారు. లోడ్డుకు 50 నుంచి 60 టన్నులు చొప్పున రోజుకు 1500 నుంచి 1800 టన్నులు క్వార్ట్జ అక్రమ రవాణా జరుగుతోంది. ప్రస్తుతం టన్ను ధర రూ.40-65వేలు పలుకుతోంది. సాధారణంగా ఇంకెవరైనా అయితే టన్ను సరుకును రూ.7వేలకు మాజీ మంత్రికి ఇచ్చేయాలి. కానీ ఇది మంత్రి ఇలాకా కదా! వీరు స్వతంత్రంగా చెన్నైకి ఎగుమతి చేసి టన్ను 40-65 వేల రూపాయలకు అమ్ముకొంటున్నారు. ఈ లెక్కన రోజు కోటి రూపాయల క్వార్ట్జ దోపిడీ చేస్తున్నారు. ఇది కాకుండా ఇదే మండలంలోని వరదాపురం రుస్తుం మైన్స్, మరుపూరులోని మరో క్వారీ నుంచి కూడా అక్రమంగా కోట్లాది రూపాయల సరుకు రవాణా అవుతోంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ దోపిడీ దొంగలకు నాయకుడని, ఈ మూడు క్వారీల నుంచి సుమారు రూ.1500 కోట్ల విలువైన క్వార్ట్జ కొల్లగొడుతున్నాడని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపిస్తున్నారు.

ఇక సైదాపురం మండలం జోగిపల్లిలో క్వార్ట్జ దోపిడీ కొనసాగుతూనే ఉంది. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఈ దోపిడీకి నాయకత్వం వహిస్తున్నారని ప్రతిపక్షాలు, క్వారీలకు హక్కుదారులు ఆరోపిస్తున్నారు. జోగిపల్లి సర్వే నెం.42,42,43, 1, 2, 3, 55-1లో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో తవ్వకాలు నిరాటంకంగా సాగుతున్నాయి. ఈ భూముల్లో కొంత ఆలయ భూములు, పట్టా, ప్రభుత్వ భూములు ఉన్నాయి. ప్రైవే టు భూముల్లోని క్వారీలపై యాజమాన్య హక్కుకు సంబంధించి కోర్టు వ్యాజ్యాలు నడుస్తున్నాయి. తవ్వకాలు జరపకూడదని, అన్ని క్వారీల మీద స్టే ఆర్డర్లు ఉన్నాయి. అయినా రాజకీయ పలుకుబడితో ఈ క్వారీల మీద పడి దౌర్జన్యంగా దోచుకొంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారులు ఏం చేయ లేక మౌనంగా ఉండిపోయారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో ఇప్పుడైనా అధికా రులు కళ్లు తెరుస్తారేమోనని ఈ భూముల హక్కుదారులు ఆశపడ్డారు. కోడ్ వచ్చినా అవినీతి అధికారుల తీరు మారలేదు. జిల్లా ఉన్నతాధికారులు కళ్లకు కట్టుకున్న బలవంతపు గంతలను విప్పలేదు. వందల కోట్ల రూపాయల విలువైన ప్రజా సంపద దోపిడీకి సంబంధించి జిల్లాకు చెందిన మంత్రి కాకాణి, మాజీ మంత్రి అనిల్‌లను బాధ్యులను చేస్తూ ఆరోపణలు వెల్లువెత్తడం గమనార్హం.



ధ్వజస్తంభం పై గరుడ పటాన్ని ఎగరేస్తున్న అర్చకులు

పరివార దేవతలకు ఆహ్వానం

● ప్రసన్నుడి ఆలయంలో వేడుకగా ధ్వజారోహణ

బిట్రగుంట, మార్చి 20 : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్నుడికి జరిగే కల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించేందుకు గరుత్మంతుడు ధ్వజారూరుడైన ఘట్టాన్ని యాగ్నికులు పంరాంకుశ ప్రసాదాచార్యులు భక్తులకు వివరించారు. అనంతర ధ్వజపటాన్ని ఎగురవేశారు. ఉదయం తిరుమంజనం, స్వామివార్లకు నూతన వస్త్రాల సమర్పణ, స్వస్తివాచనం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఈవో రాధాకృష్ణ సంప్రదాయకంగా ఉభయకర్తలను ఆహ్వానించారు.

● **కొడిముద్దల కోసం బారులు**

గరుడాళ్వారుకు అందచేసే నైవేద్యాన్ని కొడిముద్దలుగా సంతానం లేనివారికి అందచేస్తారు. ఈ కొడిముద్దల కోసం భక్తులు బారులు తీరారు. బుధవారం రాత్రి కృష్ణావతారంలో స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

● **నూతన ఆభరణాల బహూకరణ**

నెల్లూరుకు చెందిన నటుకుల సుబ్బారావు శ్రీవారికి నూతన ఆభరణాలను బహూకరించారు. ఆభరణాల సంప్రోక్షణ అనంతరం ఈవో, వేద పండితులు, భక్తులు వాటిని ఆలయంలోకి చేర్చారు. కాగా విశ్వనాథరావుపేట తాళ్లూరు పంచాయతీల మధ్య అటవీ ప్రాంతంలోని శ్రీవారి పాదాల వద్ద బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు శ్రీరాంగోపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా వెలుగుల రత్నం ఇకలేరు!

- అనారోగ్యంతో నెల్లూరులో మృతి ● శోకసముద్రంలో విద్యార్థిలోకం
- పేద విద్యార్థుల పాలిట విద్యాదాత
- మాజీ ఉపరాష్ట్రపతి విచారం, ప్రముఖుల నివాళి

నెల్లూరు (విద్య), మార్చి 20: విద్యావేత్త, రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం, 82 అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. చేజర్ల మండలం చల్లపనాయుడుపల్లిలో 1943, మే 23న జన్మించిన కొర్రపాటి వెంకటరత్నం 3వ తరగతి వరకు సొంతూరిలోనే చదివారు. 4, 5 తరగతులను అమ్మమ్మ ఊరు కొత్త పాలెంలో చదువుకున్నారు. ఆత్మకూరులో ఆరు నుంచి 10వతరగతి వరకు చదివి, 1961-62లో పీయూసీ పూర్తిచేశారు. 1963-66లో నెల్లూరు వీఆర్ కళాశాలలో బీఎస్సీ కెమిస్ట్రీలో డిస్టింక్షన్ సాధించారు. 1966లో అదే కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో డెమోన్‌స్ట్రేటర్‌గా నెలకు రూ.240ల జీతంతో ఉద్యోగిగా చేరారు. అదే ఏడాది నెల్లూరు రజకవీధిలో జయంతి ట్యుటోరియల్స్‌ను ప్రారంభించారు. అక్కడ నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా 1983లో రత్నం కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. 1985లో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన రత్నం తన విద్యాసంస్థలను రాష్ట్రంలోనే సంచలనాత్మక విద్యావేదికగా గుర్తింపు పొందేలా చేశారు.

● చిన్నారులకు గుండె ఆపరేషన్లు

ఓవైపు విద్యనందిస్తూనే మరోవైపు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2005లో చిన్నారి హార్ట్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి 140 మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్‌లు చేయించారు. ఆయన కుమారులు కృష్ణకిషోర్, వేణుగోపాల్ 'శీలేన శోభతే విద్య' అనే నినాదంతో విద్యాసంస్థలను మరింత విస్తరింప చేశారు.

● మూడేళ్లుగా అనారోగ్యం

మూడేళ్లుగా రత్నం మాస్టారు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం తీవ్ర అస్వస్థకు గురైన ఆయన తన నివాసంలో మృతి చెందారు. నెల్లూరులోని హరనాథపురం శ్రీకృష్ణ అవెన్యూలో ఉన్న ఆయన నివాసంలో ఉంచిన భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, విద్యార్థులు సందర్శించి నివాళులర్పించారు. రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ పి.స్రవంతి, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేతలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్.అమ్మల్లా, ఏపీపీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు షేక్.అన్వర్‌బాషా, జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ చైర్మన్ బలరామయ్యనాయుడు, వైస్ చైర్మన్ వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.




రత్నం భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న అభిమానులు (ఇన్‌సెట్‌లో) టీడీపీ నేత నారాయణ

ఎంతోమందిని జ్ఞానవంతులుగా తీర్చిదిద్ది..



రత్నం మాస్టారుగా సుపరిచితులైన కేవీరత్నం పరమదించారని తెలిసి ఎంతో విచారించాను. వ్యక్తిగతంగా ఆయన నాకు ఎంతో ఆత్మీయులు. విద్యారంగంలో వారి చొరవను నేను ఎంతగానో అభిమానించేవాణ్ని. విద్య కేవలం మార్కుల కోసం మాత్రమేకాదు విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి అనే ఏకాభిప్రాయం మా ఇద్దరిలో ఉండేది. ఉపరాష్ట్రపతిగా ఉన్నప్పుడు నెల్లూరు పర్యటనలో భాగంగా రత్నం ఆరోగ్యం బాగాలేదని తెలిసి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించాను. ఇటీవల వారి కుటుంబ సభ్యులు కలిసినపుడు కూడా వారి ఆరోగ్యం గురించి వాకబు చేశా. ఇంతలోనే ఆయన తుదిశ్వాస విడిచారన్న వార్త అత్యంత బాధాకరం.

- వెంకయ్యనాయుడు, పూర్వ ఉపరాష్ట్రపతి

రత్నం సార్ మరణం బాధాకరం



విద్యావేత్త రత్నం మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది. మా కుటుంబానికి ఎంతో ఆత్మీయులైన రత్నం సార్ ఇకలేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

- టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కేవీరత్నం మృతి బాధాకరం



కేవీ రత్నం మృతి బాధాకరం. విద్యారంగం చరిత్రలో ఆయన చెరగని ముద్ర వేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాడ సానుభూతి తెలియచేస్తున్నాను.

- బీద రవిచంద్ర, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

విద్యార్థిలోకాన్ని కలచివేసింది



కేవీ.రత్నం మృతిచెందడం విచారకరం. ఎంతోమంది విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజనీర్‌లుగా తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. అంతటి గొప్ప వ్యక్తి మృతి చెందారన్న వార్త విద్యార్థిలోకాన్ని కలచివేసింది. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాల, భగవంతుడు వారికుటుంబానికి మనోధైర్యాన్ని అందించాలని కోరుకుంటున్నాను.

- అబ్దుల్ అజీజ్, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు

బాధాకరం

రత్నం విద్యాసంస్థల అధినేత, ప్రముఖ విద్యావేత్త కేవీ రత్నం మృతి బాధాకరం. ఆయన మృతి విద్యారంగానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా.

- పొంగూరు నారాయణ, టీడీపీ నేత

తండ్రిని హతమార్చిన తనయుడు

● కుటుంబ కలహాలే కారణం

ఇందుకూరుపేట, మార్చి 20: కుటుంబ కలహాలతో తండ్రిని కొడుకు హతమార్చిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డేవిస్‌పేటలో నివాసముంటున్న నెల్లూరు ప్రసాద్, అతని భార్య వెంకటరమణమ్మ కొంతకాలంగా మనస్పర్థలతో వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ప్రసాద్ తన భార్య వెంకటరమణమ్మ ఇంటికి వచ్చి గొడవపడి గడ్డపారతో కొట్టగా ఆమెకు గాయాలయ్యాయి. అది చూసి ఆయన పెద్ద కుమారుడు మహేష్ కోపంతో అదే గడ్డపారతో తన తండ్రి ప్రసాద్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రసాద్ నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ వీరేంద్రబాబు, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హత్యకు గురైన ప్రసాద్ మృతదేహం

అభయాంజనేయుడి ఆలయంలో చోరీ

వరికుంటపాడు, మార్చి 20: తూర్పుబోయమడగల బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. రోజు మాదిరిగా మంగళవారం ఆలయ పూజారి నాదిండ్ల రత్తయ్య పూజలు నిర్వహించిన ఆలయ గేటుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి యధావిగా ఉదయం ఆలయానికి చేరు కున్నాడు. ప్రధాన గేటు తాళాలతో పాటు హుండీని పగులకొట్టి చోరికి పాల్పడినట్లు గుర్తించి స్థానికులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిరుపతయ్య తన సిబ్బందితో కలిసి వెళ్లి ఆలయంతో సహా పరిసరాలను పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు వరుసగా మూడో ఏడాది చోరికి పాల్పడడం గ్రామంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



తాళాలు పగులగొట్టిన హుండీ

పోలేరమ్మ ఆలయంలో..

మర్రిపాడు : మండలంలోని నందవరంలోని పోలేరమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి హుండీ దొంగతనం జరిగింది. తెల్లవారుజామున స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆలయానికి వచ్చి పరిసరాలను పరిశీలించారు. హుండీలోని నగదును తీసుకొని ఆలయానికి ఆమడ దూరంలో ఖాళీ హుండీని వదిలేసి వెళ్లిపోయారు. క్లూస్ టీమ్ సహకారంతో కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.



దుండగులు వదిలివెళ్లిన హుండీ

ఈసీఐ ఆదేశాల మేరకే మద్యం నిల్వ ఉంచాలి

● కలెక్టర్ హరినారాయణన్ ● ఐఎంఎల్ డిపో, డిస్టిలరీ పరిశీలన

నెల్లూరు రూరల్, మార్చి 20 : భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశానుసారంగానే మద్యం గోదాముల్లో నిల్వ ఉంచాలని, దానిని అతిక్రమించి వ్యవహరించొవద్దని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ హెచ్చరించారు. నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాళెం వద్ద గల మద్యం నిల్వ గోదాము (ఐఎంఎల్ డిపో)ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం నిల్వ వివరాలు తెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. వాహన రాకపోకల వివరాలు సేకరించారు. అనంతరం సర్వేపల్లిలోని ఎస్ఎన్‌జే డిస్టిలరీ మద్యం తయారీ కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎల్ డిపో మేనేజర్ నాగమల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ఐఎంఎల్ డిపోలో కలెక్టర్ హరినారాయణన్

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించండి

● ఆర్వో వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), మార్చి 20 : నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని నెల్లూరు నగర కమిషనర్, రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ సెక్టార్ అధికారులను ఆదేశించారు. బుధవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ భవనంలో ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను గుర్తించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సౌకర్యాలన్నీ ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమలుపై క్షేత్ర స్థాయిలో పరిశీలన జరపాలని సూచించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వికాస్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	106
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	216
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6261
వెండి కిలో ధర	రూ. 76,100
వెండి ఒక గ్రాము	రూ. 78.10

కండలేరు డ్యాంను సందర్శించిన ట్రైనీ కలెక్టర్

రాపూరు (డక్కిలి) : కండలేరు డ్యాంను బుధవారం ట్రైనీ కలెక్టర్ సంజన సిన్హా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కండలేరు డ్యాం నిర్మాణానికి సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుగుగంగ అధికారులు వివరించారు. డ్యాం గెస్ట్‌హౌస్‌లో అధికారులతో కొంతసేపు మాట్లాడారు. ఆమె వెంట తెలుగుగంగ ఎస్సీ ఎంవీ రమణారెడ్డి, డీఈఈ పి.విజయకుమార్, ఎం.విజయరామిరెడ్డి, నాగేశ్వరరావు ఉన్నారు.



కంటేపల్లిలో ఆగని గ్రావెల్ తవ్వకాలు

- ఎన్నికల కోడ్ ఉండగా అనుమతులు ఎలా ఇస్తారు?
- రైతులు, గ్రామస్థుల అభ్యంతరం
- తరలింపును అడ్డుకున్న రెవెన్యూ, పోలీసు శాఖలు
- యథేచ్ఛగా మళ్లీ మాఫియా బరితెగింపు

వెంకటాచలం, మార్చి 20: మండలంలోని కంటేపల్లి పంచాయతీ నందిగుంట చెరువులో రెండు రోజులుగా గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఎక్స్‌కవేటర్, పదుల సంఖ్యలో టిప్పర్లు పెట్టి చెరువునే కొల్లగొడుతున్నారు. దీంతో కంటేపల్లి గ్రామస్థులు, రైతులు, ప్రతిపక్ష నాయకులు మంగళవారం రాత్రి తవ్వకాలను అడ్డుకొని తీవ్ర అభ్యంతరం తెలిపారు. తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు చెప్పడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, అధికారులు అనుమతులు ఎలా ఇస్తారంటూ వారు ఆగ్రహించారు. ఈ విషయాన్ని వారు రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం రాత్రి వారు తవ్వకాలను నిలిపి వేశారు. అయితే తిరిగి బుధవారం ఉదయం తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతుండడంతో పోలీసులు వచ్చి తవ్వకాలను నిలిపి వేయాలని హెచ్చరించారు. తమ వద్ద అనుమతులు ఉన్నాయని చెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

● అధికార పార్టీ నేతల హస్తం

కాగా గ్రామస్థులు, రైతులు, ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతూ వేసవిలో చెరువుల్లో కొద్దిపాటి నీళ్లు నిల్వ ఉంటాయని, ఇలా గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇస్తే ఉన్న నీళ్లు పోతాయని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ఎలా అనుమతులు ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. గ్రావెల్ తవ్వకాల వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందని, కాబట్టే అధికారులు ఆ వైపు చూడడంలేదని వారు ఆరోపిస్తున్నారు. నందిగుంట చెరువును ఎందుకు పనికి రాకుండా లోతైనా గుంతలు తవ్వి మరీ గ్రావెల్‌ను కొల్లగొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా వారు పట్టించుకోవడం లేదని, ప్రజా సంపదను దోచుకుంటున్న వారికే ఇరిగేషన్ అధికారులు సహకరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. తాము ఎన్ని అభ్యంతరాలు తెలిపిన గ్రావెల్ తవ్వకాలు కొనసాగుతుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు నందిగుంట చెరువులో గ్రావెల్ తవ్వకాలను నిలిపివేయాలని వారు కోరుతున్నారు.



గ్రావెల్ తవ్వకాలతో నందిగుంట చెరువులో ఏర్పడిన గుంతలు

టెన్త్ పరీక్షలకు 27,993 మంది హాజరు

నెల్లూరు (విద్య), మార్చి 20: జిల్లాలో 176 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పదవతరగతి పరీక్షల్లో బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 28,909 మంది హాజరు కావాల్సి ఉండగా, 27,993 మంది హాజరయ్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 28,411 మందికిగాను 27,913 మంది హాజరు కాగా, 498 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రైవేట్ విద్యార్థులు 498 మంది హాజరు కావాల్సి ఉండగా 80 మంది హాజరయ్యారు. 418 మంది గైర్హాజరయ్యారు. కాగా విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం ఆరు కేంద్రాలను, డీఈవో పీజేవీ.రామారావు మూడు కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ 68 కేంద్రాలను పరిశీలించారు. సౌకర్యాలు సరిగా లేని కేంద్రాల్లో వెంటనే సౌకర్యాలు కల్పించాలని అధికారులను వారు ఆదేశించారు.

● ఓపెన్ స్కూల్ పరీక్షలకు 4,656 మంది హాజరు


ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు బుధవారం మొత్తం 4,656 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షలకు టెన్త్‌లో 1,646 మంది హాజరు కావాల్సి ఉండగా 1538 మంది హాజరయ్యారు. 108 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌కు 3,401 మంది హాజరు కావాల్సి ఉండగా, 3,118 మంది హాజరయ్యారు. 283 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద 5,047 మంది హాజరు కావాల్సి ఉండగా 4,656 మంది హాజరయ్యారు. 391 మంది గైర్హాజరయ్యారు. అధికారులు మొత్తం 9 పరీక్ష కేంద్రాలను పరిశీలించారని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అసదుల్లాఖాన్ తెలిపారు.

నాయకులతో వెళితే వేటే..!

● సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై ఈసీ నిఘా

నెల్లూరు (సిటీ), మార్చి 20 : కార్పొరేషన్ కార్యాలయంలోని పబ్లిక్ హెల్త్ విభాగం లో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వైసీపీ అభ్యర్థిని చర్చికి తీసుకెళ్లి ప్రార్థనలు చేయించడం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందడంతో సమగ్ర విచారణకు కమిషనర్ ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక జరిగిన సంఘటనలివి. రాజకీయ పార్టీలతో సత్సంబంధాలున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు నిఘా పెట్టాయి. అలాంటివారిని గుర్తించేందుకు పార్టీలోని కొందరు కార్యకర్తలను నియమించినట్లు సమాచారం. మరోవైపు ఆధారాలతో సహా వస్తున్న ఫిర్యాదులపై ఎన్నికల అధికారులు వెంటనే చర్యలు తీసుకుని విధుల నుంచి తప్పిస్తున్నారు.

సంక్షేమ పథకాల్లోని లబ్దిదారుల పేర్లను ఓ రాజకీయ పార్టీకి అందించడంతోపాటు తోటి వలంటర్లను కూడా లబ్దిదారుల పేర్లు సదరు రాజకీయ పార్టీకి ఇవ్వాలని సందేశాలు పంపిన వెంగళరావునగర్-2 వలంటీరు శ్రీనివాసులును కార్పొరేషన్ కమిషనర్, ఆర్వో వికాస్‌మర్మత్ విధుల నుంచి తప్పించారు.



● డివిజన్లు, గ్రామాలలో ఆరా...

ఈ సార్వత్రిక ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీలకు చావో రేవో కావడంతో ప్రత్యర్థి లోపాలు, బలహీనతలను గమనిస్తూ అదే సమయంలో వారికి సహకరిస్తున్న ప్రభుత్వ యంత్రాంగంపై లోతైన నిఘా ఉంచారు. నెల్లూరు నగర పరిధిలోని డివిజన్లు, రూరల్ మండలంలోని గ్రామాలలో ఈ తరహా నిఘా జరుగుతోంది. వలంటీరు నుంచి సచివాలయ ఉద్యోగి, ఆపై స్థాయి అధికారుల నడవడికలపై రాజకీయ నాయకులు రహస్య పరిశీలన జరుపుతున్నారు. ప్రతిసారి రాజకీయ పార్టీల వ్యవహారాలను ఎన్నికల యంత్రాంగం పరిశీలిస్తుండగా ఈసారి అందుకు భిన్నంగా ఈ తంతు జరగడం గమనార్హం.

అర్హులకు అందని యంత్ర పరికరాలు

- అవస్థల్లో చిన్న, సన్నకారు రైతులు
- అయిన వాళ్లకే కస్టం హైరింగ్ సెంటర్లు

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 20: వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా గతంలో ఎంతోమంది రైతులకు లబ్ధి చేకూరేది. స్ప్రేయర్లు, పంట ఉత్పత్తులు కాపాడుకునేందుకు టార్పిలిన్ పట్టలు ఎక్కువమంది రైతులకు వ్యక్తిగత రాయితీపై అందేవి. ప్రస్తుతం రాయితీపై ఇవన్నీ అందకపోగా యంత్ర పరికరాల ధరలు కూడా పెంచారు. అంతేకాక ఆర్‌బీకేల ద్వారా యూనిట్‌గా యంత్ర పరికరాలు అందజేసినా అవి అధికార పార్టీ వారికే అందుతున్నాయి.దీంతో అర్హులయిన చిన్నసన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



● నిబంధనలు బేఖాతర్

జిల్లాలో దాదాపు 545 ఆర్‌బీకేలున్నాయి. ప్రతి కేంద్రానికి ఓ యూనిట్ చొప్పున దాదాపు 600ల వరకు కస్టం హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ) ఉన్నాయి. ఇవన్నీ అధికార పార్టీకి చెందిన వారికి రైతు సంఘం పేరుతో చాలావరకు రాయితీ యంత్రాలు అందజేశారు. ఒక్కో సెంటర్‌కు రూ.15లక్షలు ప్రభుత్వం కేటాయిస్తుండగా, అందులో 50శాతం రాయితీ, 40శాతం రైతు గ్రూపు పేరుతో బ్యాంకు రుణం, 10శాతం గ్రూపులోని రైతుల వాటాగా కేటాయించారు. వీటి ద్వారా చిన్న, సన్నకారు రైతులకు అద్దె ప్రాతిపదికన వాటిని అందించలన్నది ప్రభుత్వ నిబంధన. అయితే ఎక్కడా ఆ పరిస్థితి లేదు. ట్రాక్టర్లు ఒక చోట, ట్రక్కు ఒక చోట, ఇతర యంత్ర పరకరాలు ఆయా గ్రూపుల్లోని అధికార పార్టీ నాయకులు ఎవరికి అవసరమైనవాటిని వారు కేటాయించు కుంటున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

● వ్యక్తిగతంగా అందజేయాలి

గత ప్రభుత్వం ఆయిల్ ఇంజన్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలను రాయితీపై ఎక్కువ మంది రైతులకు అందించేది. దీంతో రైతులకు ప్రయోజనకరంగా ఉండేది. అయితే ప్రస్తుతం రాయితీపై సరఫరా లేకపోవడంతో వ్యాపారులు వాటి ధరలు పెంచేశారు. మరోవైపు ఆర్‌బికేల ద్వారా యూనిట్‌గా యంత్ర పరికరాలు అందజేసినా అధికారపార్టీ వారికే ఉపయోగపడుతున్నాయి. రైతు ప్రభుత్వం అంటూనే వైసీపీ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోంది. దీంతో సన్న, చిన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనిట్‌గా కాకుండా వ్యక్తిగతంగా రాయితీపై యంత్ర పరికరాలు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రసన్నుడి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలన

బిత్రగుంట, మార్చి 20: బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను కావలి డీఎస్పీ వెంకటరమణ బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 400 మంది పోలీసులతో బందోబస్తు, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో స్థలాభావం కారణంగా వాహనాలను అనుమతించబోమని తెలిపారు. ఆలయ అధికారులు, కార్యనిర్వాహకులకు మాత్రమే వాహన పాసులు ఇస్తామన్నారు. ఈనెల 22న గరుడసేవ, 23న తెప్పోత్సవం, 24న శ్రీవారి కల్యాణం, రథోత్సవం సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. కావున భక్తులు తమ విలువైన ఆభరణాలు, వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ తెలిపారు. అనుమానిత వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, తహసీల్దారు వెంకటరత్నం, ఎస్ఐ భోజ్య, వీఆర్వోలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

నెల్లూరు (లీగల్), మార్చి 20 : చెల్లని చెక్కు ఇచ్చాడన్న కేసులో నేరం రుజువు కావడంతో కావలికి చెందిన డాక్టర్ అల్లం ప్రతాప్ కుమార్ అనే వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు పరిహారం కింద రూ.పది లక్షలు చెల్లించాలని నెల్లూరు నగర మొదటి తరగతి స్పెషల్ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ టీ సుయోధన్ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నగరం బాలాజీ నగర్‌కు చెందిన అమ్మినేని పెంచలయ్య అనే అతని వద్ద కావలికి చెందిన డాక్టర్ అల్లం ప్రతాప్ కుమార్ తన అవసరాల నిమిత్తం 2015 జూలై 29వ తారీఖున రూ.3,50,000 అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోట్ రాసి ఇచ్చాడు. సదరు అప్పు తీర్చేందుకు 2018 జనవరి 29న రూ.5,50,000లకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కు బ్యాంకులో చెల్లకపోవడంతో బాధితుడు కోర్టులో ప్రైవేట్ కంప్లయింట్ దాఖలు చేశాడు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, పరిహారం చెల్లించేలా తీర్పు ఇచ్చారు. పరిహారం మొత్తాన్ని మూడు నెలల్లోపు చెల్లించకుంటే మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

హెల్త్ ప్రొవైడర్స్ వివరాలు నమోదు చేసుకోవాలి

నెల్లూరు (వైద్యం), మార్చి 20 : ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో హెల్త్ ప్రొవైడర్స్ వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, లాబ్స్, స్కానింగ్ కేంద్రాలు, ఆప్తాల్మిక్, డెంటల్ క్లినిక్‌లు, ఫిజియోథెరపీ సెంటర్లలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర సాంకేతికి సిబ్బంది తమ వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

'క్షయ'పై అవగాహన అవసరం

● ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), మార్చి 20 : క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. బుధవారం నగరంలోని సెయింట్ జోసఫ్ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు అన్ని రకాల వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల లో విలువైన మందులు అందిస్తారని, వ్యాధిగ్రస్థులు వీటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుకు ఎన్నికల దెబ్బ

● వడ్డీ మాఫీకి పదిరోజులే గడువు
● మార్చి 31 దాటితే వడ్డీతో చెల్లించాల్సిందే !


విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆత్మకూరు మార్చి 20: పన్నుల వసూలుపై ఎన్నికల దెబ్బ పడింది. కోడ్ రాకముందు కూడా ఆత్మకూరు మున్సిపాలిటీలో అధికారులు పన్నుల వసూలుపై శ్రద్ధ చూపినా ఆశించిన మే ర వసూలు కాలేదు. పన్నుల వడ్డీ మాఫీకి 10రోజులే గడువుంది. మార్చి 31 దాటితే వడ్డీతో చెల్లించాల్సిందే. గడువు దాటకముందే పన్నులు చెల్లించాలని అధికారులు ప్రచారం చేస్తూ.. మరోవైపు విద్యుత్ కనెక్షన్లు కట్ చేస్తున్నారు. పన్నులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్లు తొలిగించడం ఏమిటని బకాయిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాల్టీలో ఏటా సక్రమంగా పన్నులు చెల్లించని వారికి కూడా వడ్డీ పడుతూ వస్తోంది. ఈ భారంతో కొంతమంది సంవత్సరాలుగా పన్నులు చెల్లించడం లేదు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం ఇటీవల వడ్డీమాఫీ నిర్ణయం తీసుకుంది. వడ్డీమాఫీతో మున్సిపాలిటీకి సంబంధించి కోర్టు కేసుల అసెస్మెంట్‌తో పాటు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలు సంబంధిత పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకుంటారని అధికారులు భావించారు. అంత ఆశాజనకంగా పన్నుల చెల్లింపులు జరగలేదు. ఈ ఏడాది ఎన్నికల విధుల నేపథ్యంలో అధికారులు కూడా ఏటా మాదిరి పన్నుల చెల్లింపులపై కూడా ప్రత్యేక దృష్టిసారించ లేకపోతున్నారు. ఆత్మకూరులో ఆస్తిపన్ను అసెస్మెంట్‌లు 8,220 ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3.10కోట్లు పన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.2.5 కోట్లు మాత్రమే వసూలైంది. నీటిపన్ను రూ.70లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బకాయిదారులు స్పందించి పన్నులు చెల్లిస్తే ప్రయోజనం చేకూరుతుంది.

వడ్డీరాయితీని సద్వినియోగం చేసుకోవాలి
-షేక్ ఫజులుల్లా, మున్సిపల్ కమిషనర్

ఆస్తిపన్ను బకాయిలకు ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీ అవకాశాన్ని పట్టణవాసులు సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31లోగా వీలై నంత త్వరగా పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలి. సెలవు రోజులలోనూ మున్సిపల్ కార్యాలయంలో పన్నుల వసూలు కేంద్రం పనిచేస్తుంది. మీసేవా, ఆన్‌లైన్ పద్ధతు ల్లో పన్నులు చెల్లించవచ్చు.

అందరి సహకారంతో విజయం సాధిస్తా

● టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి కాకర్ల సురేష్

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): ఈ సార్వత్రిక ఎన్నికల్లో అందరి సహకా రంతో అఖండ విజయం సాధించి ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగురవేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. బుధవారం దుత్తలూరు సెంట ర్‌లోని భారత్ పెట్రోల్ బంకు ఆవరణలో టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం ఆధ్వ ర్యంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి పరిచయ కార్యక్రమం నిర్వహిం చారు. ట్రస్టు ఆధ్వర్యంలో రెండేళ్లుగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని పేదలకు ఆరోగ్య, ఆర్థికప రంగా సేవా కార్యక్రమాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటా నన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయడం, అక్రమ కేసులు బనాయించడం, భూములు లాక్కొని ఆర్థికంగా నష్టపర్చడం దారుణమన్నారు. కార్యకర్తల జోలికొస్తే ఊరుకుండే ప్రసక్తే లేదన్నారు. ఎం.గురవయ్యనాయుడు, శ్రీకుర్తి రవీంద్రబాబు ఉన్నారు.


కంభం, కాకర్లను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

తెల్లరాయి తరలింపు టిప్పర్ పట్టివేత


పోలీసులకు పట్టుబడిన టిప్పర్

సంగం: ఎలాంటి లైసెన్సు అనుమతి లేకుండా తెల్లరాయిని తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం సంగం పోలీసులు స్థానిక బస్టాండ్‌లో గుర్తించి స్టేషన్‌కు తరలించారు. కలిగిరి వైపు నుంచి గూడూరు వైపు తెల్లరాయి లోడుతో వెళ్తుండగా తనిఖీ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కమనీయం..చెన్నకేశవుడి కల్యాణం


కలవాయి: స్వామి కల్యాణంలో పాల్గొన్న మాదాసు గంగాధరం దంపతులు

కలువాయి, మార్చి 20: స్థానిక చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ, మాదాసు యజ్ఞపవన్, అపర్ణ దంపతులు వ్యవహరించారు. ఉదయం పంచామృతాభిషేకం, అగ్నిప్రతిష్ఠాపన, శాంతిహోమం, రాత్రికి గరుడవాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వలంటీర్లకు సెల్‌ఫోన్ల అప్పగింత

కలువాయి: వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల గ్రామ సచివాలయల సిబ్బంది పలువురు వాలంటీర్ల వద్ద నుంచి ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్‌లు, సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. కొందరు వాలంటీర్లు వారి వద్ద నున్న సెల్‌ఫోన్లు సచివాలయ సిబ్బందికి స్వాధీనం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లులన్నీ తిరిగివారికి ఇచ్చేశారు. ఈ విషయమై ఎంపీడీవో ప్రభాకర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందితే తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు.

పొగాకు రైతును ఆదుకోవాలి

ఆత్మకూరు: టి.ముస్తాపురంలో రెండురోజుల కిందట నాదెళ్ల సుబ్బారావుకు చెందిన పొగాకు బ్యారెన్ దగ్ధం అయ్యింది. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, పొగాకు బోర్డు మాజీ వైస్‌చైర్మన్ చెరుకూరు రమణయ్యనాయుడు బుధవారం పొలానికి చేరుకుని దగ్ధమైన పొగాకు బ్యారెన్‌ను పరిశీలించారు. బాధిత రైతుకు రూ.10లక్షల వరకు నష్టం అందజేయాలని డిమాండ్ చేశారు. డీసీపల్లి పొగాకు బోర్డు చైర్మన్, ఇన్సూరెన్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వారివెంట డీసీపల్లి పొగాకు బోర్డు రైతు సంక్షేమ నాయకుడు గాలి నరసపనాయుడు, కొల్లి శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.

బీఎల్‌వోలతో సమీక్ష

ఉదయగిరి రూరల్, మార్చి 20: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం మండలంలోని బూత్ లెవల్ అధికారులతో వీఆర్వో నెహ్రూబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గతంలో మాదిరిగా కాకుండా నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఫెసిలిటీ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వేయాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన సిబ్బంది ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బీఎల్‌వోలు సర్పంచ్, ఉప సర్పంచ్ ఓట్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో సరి చూసుకోవాలన్నారు.

జనసైనికుల సంబరం

సీతారామపురం, మార్చి 20: జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భోగినేని కాశీరావు ఆధ్వర్యంలో బుధవారం జనసేన కార్యాలయంలో పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి, వేములపాటి అజయ్ కుమార్ జన్మదినం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసైనికులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాసులు, శిరల నారాయణ, కాశీరత్తయ్య, బండి సురేష్, బండి మధు, పవన్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న భోగినేని కాశీరావు

జగన్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారు ..!

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి

వరికుంటపాడు: అగమ్యగోచరంగా పరిపాలన సాగించి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం తథ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 400సీట్లతో కేంద్రంలో బీజేపీ అధి కారం చేపట్టడం ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, వంశీరెడ్డి, మూలె బాలకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, మాల్యాద్రి పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి

వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి

వింజమూరు: ఎస్సీల వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్య సాధనలో భాగంగా మంగళవారం తక్కెళ్లపాడులో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధించి జాతి బిడ్డల భవిష్యత్‌కు పూలబాట వేయాలని, జిల్లాలోని ప్రతి మండలంలో గ్రామస్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో ప్రతి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శక్తివంచన లేకుండా కృషిచేయాలని, ఎస్సీ వర్గీకరణకు అండగా నిలిచిన వారికి మనం తోడుగా ఉండాలన్నారు. అనంతరం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంకి వెంకటేష్ మాదిగ, అంకి బాలరాజు, అంకి తిరుపాలు, అంకి రామయ్య, గవ్వల ఇశ్రాయేల్ మాదిగ, మంగళ కిషోర్, పవన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు చేరిన సర్టిఫికెట్లు

సీతారామపురం, మార్చి 20: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం ప్రభుత్వ లోగోలతో కూడిన సర్టిఫికెట్లు మండల కార్యాలయానికి చేరినట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ముఖ్యమంత్రి ఫొటో లేకుండా నూతన సర్టిఫికెట్లు అందజేస్తున్నామని తెలిపారు. మండలంలోని తొమ్మిది సచివాలయలలో ఇకనుంచి వివిధ ధ్రువీకరణ పత్రాలకు ఈ సర్టిఫికెట్లు ఉపయోగించాలని సిబ్బందికి ఆదేశించామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఉదయగిరి, మార్చి 20: ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమకుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయగిరి మండల సెక్టార్ బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఉద్యోగులు రాజకీయ పార్టీలకు ప్రచారం నిర్వహించిన రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్న, బహుమతులు తీసుకున్న ఉపేక్షించేది లేదన్నారు. కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి కే నెహ్రూ బాబు పాల్గొన్నారు.

వెంగమాంబ హుండీల లెక్కింపు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 20: నర్రవాడ శ్రీవెంగమాంబ పేరంటాల అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకర్‌బాబుల ఆధ్వర్యంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి జే.శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీలు హుండీల లెక్కింపు ప్రారంభించారు. నాలుగు నెలల 2రోజుల్లో ఆలయంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించారు. రూ.16,81,545ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత స్టేట్‌బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

ఉదయగిరి రూరల్, మార్చి 20: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలకు క్షేత్ర సహాయకులు వసతులు కల్పించాలని ఏపీవో శ్రీనివాసులు సూచించారు. బుధవారం నేలటూరు, శకునాలపల్లిల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేసి కూలీలు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో కూలీలకు నీడ, నీటి వసతులు కల్పించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేసేలా చూడాలన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు...

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): రోజు రోజుకు ఎండలు మండుతున్నాయి. గుక్కెడు నీటి కోసం మూగజీవాలు, పక్షులు విల విలలా డుతున్నాయి. దుత్తలూరు తహసీల్దారు కార్యా లయ సిబ్బంది తహసీల్దారు యశోద ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో ఓ నీటి తొట్టిని ఏర్పాటు చేసి వాటి దాహార్తి తీర్చేందుకు నీటితో నింపారు. కార్యాలయ ఆవరణలో ప్రతిరోజు పక్షులు, కోతులు, ఇతరత్రా జీవాలు నీటి కోసం పడుతున్న కష్టాలను కళ్లారా చూసి తాము ఈ కార్య క్రమం చేపట్టామన్నారు. కార్యాలయ అధికా రులు, సిబ్బంది తీసుకొన్న నిర్ణయంపై స్థానికులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ ఎస్‌డీ గులాం పాల్గొన్నారు.


కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నీటితొట్టి


భారంగా పశుగ్రాసం

ఉదయగిరి: ఉదయగిరి, సీతారామ పురం ప్రాంతంలో ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవక రైతులు వరి సాగు చేపట్టలేదు. వరిగడ్డి కొనుగోలు భారమవుతుండడంతో పశుపోషకులు లబోదిబో మంటున్నారు. పశుపోషణపై జీవించే పశుపోషకులు సుదూర ప్రాంతాలైన రుద్రకోట, కావలి ఆత్మకూరు, జలదంకి, సంగం, కోవూరు, కలిగిరి ప్రాంతాల నుంచి ఎండు గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్ల లో తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి బాడుగతో సహా ట్రాక్టర్ గడ్డి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై పశుగ్రాసాన్ని పంపిణీ చేయాలని యజమా నులు కోరుతున్నారు.



ట్రాక్టర్లలో వరిగడ్డిని తెచ్చుకుంటున్న మెట్ట రైతులు

వెంటాడుతున్న వర్షాభావం!

● పూర్తిగా నిండని రాళ్లపాడు ప్రాజెక్టు ● చెరువులకు అరకొరగా చేరిన నీరు ● బీడుగా మారిన భూములు


రాళ్లపాడు ప్రాజెక్టులో తగ్గిన నీటిమట్టం

లింగసముద్రం, మార్చి 20 : మండలాన్ని తీవ్ర వర్షాభావం వెంటాడుతోంది. సరైన వర్షాలు లేకపోవడంతో రాళ్లపాడు ప్రాజెక్టుకు పూర్తి సామర్థ్యం నీరు చేరడం లేదు. దీంతో ప్రాజెక్టు పరిధిలోని భూములు బీడుగా మారాయి. గత ఏడాది నవంబరులో కురిసిన వర్షాలకు 21 అడుగుల పూర్తి సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులోకి కేవలం 14 అడుగుల నీరు చేరింది. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువ పరిధిలో అధికారికంగా ఉన్న 16,600 ఎకరాలలో, అనధికారికంగా ఉన్న మరో 8 వేల ఎకరాలలో రైతులు వరి పైరు సాగు చేయలేదు. అలాగే మండలంలోని లింగసముద్రం కొత్త, పాత చెరువులు, విశ్వనాథపురం, వీఆర్ కోట, చినపవని, పెదపవని, మేదరమెట్లపాలెం, మొగిలిచెర్ల చెరువులకు కూడా గత ఏడాది నీరు అరకొరగా చేరడంతో వీటి ఆయకట్టు కింద ఉన్న సుమారు 3000 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేయలేదు. మండలంలో అరకొరగా బోర్ల కింద పత్తి, శనగ, మినుము, వరి పైర్లు సాగుచేశారు. దీంతో మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. మేకలు, గొర్రెలకు పశుగ్రాసానికి ట్రాక్టర్ వరిగడ్డి ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.12 వేలకు కొనుగోలు చేస్తున్నట్టు రైతులు తెలిపారు.



ఎండిన మన్నేరు వాగు : మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉండడంతో దిగువన ఉన్న మన్నేరు వాగు ఎండిపోయింది. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. మన్నేరు పరివాహక ప్రాంతంలోని చీమలపెంట, తూనుగుంట, అన్నెబోయినపల్లి, వీఆర్ కోట, అంగిరేకులపాడు గ్రామాల రైతులు మన్నేరుకు ఇరువైపులా పత్తిపైరు సాగు చేశారు. మన్నేరులో రైతులు వేసుకొన్న బోర్లకు నీరు సరిగా అందక పత్తిపైరు వాడుముఖం పడుతున్నట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు మన్నేరును ఇసుకాసురులు తోడేస్తుండడంతో మన్నేరులోని భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని చెబుతున్నారు.

రోజుకు వెయ్యి మందికే 'ఉపాధి' : మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో రోజుకు 5 వేల మందికి ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా 14 పంచాయతీలలో రోజుకు 1000 మందికి పనులు కల్పిస్తున్నారు. దీంతో ఉపాధి లేక రైతు కూలీలు అవస్థలు పడుతున్నారు.

వైసీపీ మాజీ కౌన్సిలర్ టీడీపీలో చేరిక


మదన్‌మోహన్ రెడ్డికి కండువా వేస్తున్న కావ్య

కావలి, మార్చి 20: కావలి పట్టణం 29వ వార్డు వైసీపీ మాజీ కౌన్సిలర్ సురే మదన్ మోహన్ రెడ్డి, ఆ వార్డు వైసీపీ ముఖ్యనాయకులు వింతా క్రిష్టారెడ్డి, శారదమ్మలు ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీలో చేరారు. అలాగే పోలీస్‌హౌసింగ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి సోదరుడు, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచు మెట్టుకూరు అమరజీవిరెడ్డి కూడా టీడీపీలో చేరారు. వారికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్టారెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

● అల్లూరు మండలంలోని గ్రద్దగుంటకు చెందిన వైసీపీ నాయకులు తోట శ్రీహరి, చెముకుల చెంగయ్య, ఇస్రాయేలు ఆధ్వర్యంలో 15 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి స్థానిక పార్టీ కార్యాలయంలో బీద గిరిధర్ పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో-2

కొండాపురం, మార్చి 20: కింది తరగతుల నుంచే విద్యార్థుల్లో అన్నిరకాల నైపుణ్యాలను పెంపొందించాలని ఎంఈవో-2 ఆనందరావు సూచించారు. బుధవారం మండలంలోని చింతలదేవి పంచాయతీలోని పలు ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించి వారి నైపుణ్యాలను పరీక్షించారు. అదేవిధంగా వేసవి కాలం దృష్ట్యా ఓంటిపూట బడుల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

దగదర్తి(బిట్రగుంట), మార్చి 20: దగదర్తి మండలం అనంతవరంకు చెందిన ఇద్దరు దివ్యాంగులు మహేంద్ర, యశ్వత్‌లకు స్థానిక టీడీపీ నాయకుడు మాలేపాటి భానుచందర్‌నాయుడు బుధవారం ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు కే.వెంకటకృష్ణ, పొడమేకల కొండయ్య, యలమందయ్య, హరిబాబు, వినయ్, మస్తాన్, శ్రీహరి, తేజ, అనిల్ పాల్గొన్నారు.

సచివాలయం మిద్దెపై వైసీపీ జెండా!

కావలి, మార్చి 20: కావలి పట్టణం పాతూరులోని ఉర్దూ స్కూల్ వీధిలో ఓ భవనంలో కిందిపోర్షన్‌లో సచివాలయం-2 ఉండగా దానిపైన ఉన్న ఇంట్లో వైసీపీ జెండా రెపరెపలాడు తోంది. ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చినా ఆ జెండాను ఎన్ని కల సిబ్బంది తొలగించలేదు. స్వయాన సచివాలయంపైనే వైసీపీ జెండా రెపరెపలాడుతుంటే అక్కడ ఉన్న సచివాలయ ఉద్యోగులు ఎందుకు దానిని తొలగించలేదో వారికే తెలియాలి. సచివాలయంపై ఉన్న ఇంటిపై వైసీపీ జెండా కట్టి ఉండటంతో అందరూ సచివాలయంపై వైసీపీ జెండా కట్టారేమిటని చర్చించుకుంటున్నారు. ఒకవేళ అధికారుల అనుమతులు తీసు కుని ఇంటి యజమాని కట్టుకోవాలన్నా దాని కిందనే సచివాలయం ఉన్నందున దానికి అనుమతులు ఇచ్చేందుకు అవకాశాలు లేవంటున్నారు. ఎన్నికల అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.


కావలిలో 2వ సచివాలయంపై మిద్దెపై ఎగురుతున్న వైసీపీ జెండా

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కావలి రూరల్, మార్చి 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమించితే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల నోడల్ అధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని గౌరవరం సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఎన్నికల నిబంధనలపై సచివాలయ సి బ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్వో అనుమతి లేకుండా రాజకీయపార్టీలు గ్రామాల్లో ఎలాంటి ప్రచారాలు, సమావేశాలు నిర్వహించకూడ దన్నారు. నివాసాలపై పార్టీ జెండాలు పెట్టుకోవాలన్నా ఆర్వో అనుమతులు తప్పనిసరి అన్నారు. పంచాయతీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభించవద్దన్నారు. వలంటీర్లు పార్టీ కార్యక్రమాల్లో తిరిగినా, ప్రచారాలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో నేతల విగ్రహాలకు ఏర్పాటు చేసిన ముసుగులు, ఫ్లెక్సీలు తొలగించటం, శిలాఫల కాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి అఖిల, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నూడల్ అధికారి వెంకటేశ్వర్లు

భక్తులకు మెరుగైన సేవలందిద్దాం : ఆర్టీసీ డీఎం

కావలి, మార్చి 20: బోగోలు మండలం కొండబిట్రగుంటలో జరుగుతున్న ప్రసన్నుడి బ్రహ్మోత్సవాల కు వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల ద్వారా ప్ర యాణికులకు మెరుగైన సేవలు అందిద్దామని కావలి ఆర్టీసీ డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు తెలిపారు. డీఎం చాంబరులో బుధవారం ఆర్టీసీ అధికారులు, కార్మిక నాయకులతో నిర్వహించిన సమావేశంలో తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఆర్టీసీ పరంగా అందించవలసిన సేవలు, ఏర్పాట్లపై ఆయన చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు శుక్ర, శని, ఆదివారాలలో అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నందున 30 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావలి, ముంగమూరు తోటలు, అల్లూరు, కొండబిట్రగుంట రైల్వే గేట్‌ల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వలంటీర్లు, సిబ్బందిని భక్తులకు అందుబాటులో ఉంచామన్నారు. తాగునీటి వసతి కల్పించామన్నారు. భక్తులు సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజరు కేవీఆర్ బాబు, ఏఈ ఖాజామొహిద్దీన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ రవిప్రకాష్, సూపర్ వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎం శ్రీనివాసరావు

తెలుగుదేశంలో యువత చేరిక

కందుకూరు, మార్చి 20: మండలంలోని మాచవరంలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆపార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ నాగేశ్వరరావు పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చదలవాడ నరేష్, సేలం విశ్వేశ్వరరావు, తెలప్రోలు శ్రీకాంత్, జింకా శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో యువకులు అధికసంఖ్యలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో సాదినేని మాల్యాద్రి, చదలవాడ వెంకటేశ్వర్లు, దండే తిరుమలనాయుడు, బ్రహ్మయ్య, కోటి, బోలిగర్ల సురేష్, తెలప్రోలు యలమంద, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.


వైసీపీని వీడి టీడీపీలో చేరిన యువతతో ఇంటూరి

21వ వార్డులో ఇంటూరి సౌజన్య ప్రచారం

పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని పడమర మంగళిపాలెం, బైపాస్‌రోడ్డు ప్రాంతాలలో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య బుధవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు లక్ష్మీరాజ్యం, నాదెండ్ల సుబ్బులు, నాదెండ్ల లక్ష్మీరాజ్యం, పాకల రమాదేవి, భాగ్యలక్ష్మి, చిలకపాటి మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయానికి విరాళం

కందుకూరు, మార్చి 20: కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం అనివెట్టి మండపం నిర్మాణానికి బుధవారం సాలిపేటకు చెందిన కవర్తపు నవీన్, కావ్య దంపతులు రూ.25వేలు విరాళం అందజేశారు. దాతలు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ఆలయ కమిటీ సభ్యుడు కొడాలి కోటేశ్వరరావుకు నగదు అందజేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మహీధరరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం తలమానికంగా నిర్మాణం జరుగుతున్నందున మావంతు భాగస్వామ్యంగా ఈ కానుక సమర్పించుకున్నామన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా !

● కోవూరు టీడీపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


మేనిఫెస్టో కరపత్రాలను ప్రదర్శిస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు

కొడవలూరు, మార్చి 20: నియోజకవర్గంలో ప్రజలకు, ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని టీడీపీ నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని నార్తురాజుపాలెం గ్రామంలోని పీఎస్ ఆర్ కల్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, జిల్లా నాయకుడు రూప్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా వేమిరె డ్డి ప్రశాంతిరెడ్డికి టీడీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ టీడీపీలో ప్రతి కార్యకర్తకు తాము అండగా ఉంటామని, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చామని, పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం అన్నారు. తనను శాసనసభ అభ్యర్థిగా గెలిపిస్తే అవినీతి రహిత నియోజకవర్గ స్థాపనకు కృషి చేస్తామన్నారు. అలాగే తనను నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఎంపిక చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్యకర్త తన గెలుపునకు సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రజలతో తనకున్న అను బంధాన్ని వివరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగు తున్న మాఫియాను పారదోలా లంటే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించుకోవాలని, టీడీపీ జెండాను నియోజకవర్గంలో ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మన ఆడపడుచు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపునకు ప్రతిఒక్కరూ శక్తివంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను నియోజకవర్గాన్ని కోట్ల నిధులతో అభివృద్ధిపరిచామన్నారు. ప్రతి పేదవాడి సంక్షేమమే తన ధ్యేయమని, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తాను జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రజలు తమను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, జిల్లా నాయకుడు రూప్‌కుమార్‌యాదవ్, నియోజకవర్గ ఐదు మండలాల అధ్యక్షులు మాట్లాడారు. అనంతరం ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాన్ని సభలో ప్రదర్శిం చారు. ఈ సమావేశంలో టీడీపీ నియోజకవర్గ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, వీరేంద్రచౌదరి, చెముకుల శ్రీనివాస యాదవ్, కేతంరెడ్డి వినోద్ కుమార్, ఇంతా మల్లారెడ్డి, శేషయ్య, చెముకుల చైతన్య, జ్యోతి వెంకట రమణారెడ్డి, చెక్కా మదన్, మాతూరి శ్రీనివాసులురెడ్డి, నాసిన ప్రసాద్, పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విష్ణాలయంలో అన్నసంతర్పణ


అన్నసంతర్పణ చేస్తున్న నిర్వాహకులు

మనుబోలు, మార్చి 20: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయం (విష్ణాలయం)లో పాల్గుణ ఏకాదశి సందర్భంగా బుధవారం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా ఆలయంలో దేవర్లతో పాటు స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉభయదాతలుగా కలికి లక్ష్మీదేవమ్మ, కలికి వినీల్‌రెడ్డి, వైష్ణవి దంపతులు వ్యవహరించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ


సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ డైరెక్టర్

వెంకటాచలం, మార్చి 20: మండలంలోని కసుమూరు సబ్‌స్టేషన్‌ను బుధవారం విద్యుత్ శాఖ డైరెక్టర్ ఎన్‌వీఎస్ సుబ్బరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సబ్‌స్టేషన్‌లో లోడ్‌ను పరిశీలించి ఏపీ ఫీడర్స్‌లో ఎంత లోడ్ వస్తుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్‌స్టేషన్‌లోని పలు రికార్డులు తదితరాలను పరిశీలించారు. ఆయన వెంట విద్యుత్ ఏఈ టీ తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 20: బుచ్చిరెడ్డిపాళెంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన ఇంగ్లీషు పరీక్షకు 51మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో మొత్తం 7 పరీక్షా కేంద్రాల లో 1109 మంది పరీక్షలు రాయాల్సి వుండగా 1058 మంది హాజరైనట్టు సీఆర్పీ మల్లేశ్వరరెడ్డి తెలిపారు.

వెంకన్నపాలెంలో మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం

తోటపల్లిగూడూరు, మార్చి 20: మండలంలోని వెంకన్నపాలెం మత్స్యకార గ్రామంలో బుధవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలకూరు సుధీర్‌రెడ్డి, ఉప్పల శంకరయ్యగౌడ్, మహేంద్ర, దుంపల ఏసోబు, గంగాధర్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మన్నెమాలకు నివాళి

మనుబోలు: గురివిందపూడి వైసీపీ నాయకుడు మన్నెమాల సుధీర్‌రెడ్డి తండ్రి చెంచుకృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. బుధవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆయన ఉత్తరక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వేమిరెడ్డి దంపతులను కలిసిన వైసీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 20: స్థానిక వైసీపీ నాయకులు, ఒకే సామాజిక వర్గానికి చెందిన 30మందికి పైగా బుధవారం టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులను కలిశారు. వారికి పుష్పగుచ్చాలు అందజేసి తమ మద్దతు ప్రకటించారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్ష పదవికి, బుచ్చి రూరల్ బ్యాంకు త్రీమెన్ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వైసీపీ నేత కత్తి మహేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ పార్టీ రూరల్ మండల కన్వీనర్‌కు రాజీనామా పత్రం అందచేసినట్లు తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు తీవ్ర అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్రావు

తోటపల్లిగూడూరు, మార్చి 20: చట్టసభల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె శంకర్రావు అన్నారు. మండలంలోని పేడూరు గ్రామంలో బుధవారం సర్వేపల్లి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శంకర్రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన చేపట్టకపోవడంతో బీసీలకు తగిన న్యాయం జరగడం లేదని, అన్ని రంగాలలో బీసీలు వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరి మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టులో బీసీలు అతి తక్కువ జీతానికి పనిచేస్తున్నారని వారి స్థితిగతులు మార్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు నిమ్మల రమేష్‌గౌడ్, స్టేట్ యూత్ ప్రెసిడెంట్ జి ద్వారకా సూరి, టీపీగూడూరు యువత అధ్యక్షుడు సంగార్ వినోద్ కుమార్, బీసీ సంక్షేమ మండల నాయకులు కిషోర్, వి.కిషోర్, శ్రీనివాసులు, వినయ్, నిఖిల్, శేఖర్, వెంకటేశ్వర్లు, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భద్రతా బలగాల కవాతు


అనికేపల్లిలో భద్రతా బలగాల కవాతు

వెంకటాచలం, మార్చి 20 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా సీఐ అంకమరావు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ భద్రతా బలగాలు మండలంలోని అనికేపల్లి, నిడిగుంట పాళెం, గూడ్లూరువారిపాళెం గ్రామాల్లో బుధవారం కవాతు నిర్వహించారు. సీఐ అంకమరావు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ప్రజలు తమకు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేష్ తదితరులున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

● ఉప సర్పంచి ఇంటిపై వైసీపీ ప్రచారబోర్డు


ఉప సర్పంచి ఇంటిపై ఉన్న వైసీపీ ప్రచారబోర్డు

పొదలకూరు, మార్చి 20: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చి ఐదు రోజులవు తున్నా కొన్ని ప్రాంతాల్లో కోడ్ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. పొదలకూరులో ప్రధాన పోలింగ్ స్టేషన్ అయిన జడ్పీ బాలుర హైస్కూల్ ఎదురుగా రాపూరు మెయిన్ రోడ్డును ఆనుకుని వున్న ఉప సర్పంచ్ ఇంటిపై 'మా నమ్మకం నువ్వే జగన్' అనే ప్రచార బోర్డు బుధవారం కూడా దర్శనమిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల నేతల చిత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపుపై చూపిస్తున్న శ్రద్ధ అధికార పార్టీ నేతల చిత్రాలు, ఫ్లెక్సీల తొలగింపులో చూపడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అత్యధిక సీట్లు టీడీపీవే..: కోటంరెడ్డి


కరపత్రం అందిస్తున్న శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 20 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అత్యధిక సీట్లతో అధికారంలోకి రాబోతోందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి జోస్యం చెప్పారు. నగరంలో ని 15వ డివిజన్‌లో బుధవారం ఆయన పర్యటించారు. మాజీ మంత్రి నారాయణను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే నెల్లూరు స్మార్ట్ సిటీగా రూపు దిద్దుకుంటుందన్నారు. కార్యక్రమంలో అంచూరి జానకి, శ్రీనివాసులు నాయుడు, ఆకుల హను మంతరావు, శ్రీనివాసులు, నరేంద్ర పాల్గొన్నారు.

సైకో దిగిపోతే రాష్ట్రంలో అభివృద్ధి


ప్రచారంలో టీడీపీ నాయకులు

నెల్లూరు (వైద్యం), మార్చి 20 : రాబోయే ఎన్నికలతో సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఓడిపోతున్నాడని, దీంతో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. బుధవారం 47వ డివిజన్‌లో ఆయన ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. నెల్లూరును స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దే సత్తా నారాయణకే ఉందన్నారు. ఆయనను సిటీ ఎమ్మెల్యేగా నారాయణ, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ కుమార్, చెంగయ్య, అబ్దుల్ రెహమాన్, కలవగుంట్ల భాస్కర్ పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు వివాహ ఆహ్వానం


లోకేష్‌కు పెళ్లి పత్రిక అందిస్తున్న వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 20: తన చిన్న కుమారుడు డాక్టర్ సిద్ధార్థ రెడ్డి, డాక్టర్ వినీల వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా విచ్చేసి ఆశీర్వదించాలంటూ తెలుగుదేశం పార్టీ నాయకుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి బుధవారం విజయవాడలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆహ్వానించారు. ఈ నెల 27న గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో వివాహం జరగనుంది. లోకేష్‌ను కలిసిన వారిలో నారాయణ సంస్థల జీఎం విజయభాస్కర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.6.20లక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 20 : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో బుధవారం హుండీల లెక్కింపు జరిగింది. గతేడాది డిసెంబరు 30 నుంచి బుధవారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.6,20,377 వచ్చింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం సుధీర్, దేవస్థానం ఈవో వేణుగోపాల్, ధర్మకర్తలు, స్టేట్‌బ్యాంక్ ఉద్యోగులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.


హుండీల్లోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

యానాది సంక్షేమ సంఘం నేతపై విచారణకు ఆదేశం

నెల్లూరు(హరనాథపురం), మార్చి 20 : యానాది మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలి కులంపై విచారణ చేయించి ఆమె కులాన్ని నిర్ధారించి నివేదిక అందచేయాలని కలెక్టర్‌ను ఆదేశిస్తూ గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ జే వెంకట మురళి బుధవారం ఉత్తర్వులు పంపారు. సదరు సంఘం అధ్యక్షురాలు ఎస్టీ కాదని, ఆమె బీసీ కులమైన పద్మశాలి వర్గానికి చెందిన వారని, ఎస్టీగా చెలామణి అవుతున్నారని చందు అనే వ్యక్తి గిరిజన సంక్షేమశాఖకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణకు డైరెక్టర్ ఆదేశించారు.

మరో 43వేల ఇళ్లు ఇస్తా!

● మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి నారాయణ


టీడీపీని గెలిపించాలని కోరుతున్న నారాయణ

నెల్లూరు (వైద్యం), మార్చి 20 : టీడీపీ హయాంలో గతంలో పేదలకు ఇచ్చిన 43వేల ఇళ్లే కాదు.. మరో 43వేల ఇళ్లు కట్టించి ఇస్తానని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ ప్రకటించారు. బుధవారం నగరంలోని 42వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ... భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు. పార్టీ అధికారంలోకి వస్తే పేదల సొంతింటి కల నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ముందుగా భూగర్భ డ్రైనేజీని పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్రం నిధులు కూడా తీసుకువచ్చి యువతకు, మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చని తెలియచేశారు. అనంతరం మలిశెట్టి వెంకటేష్, సుంకర హేమలత దంపతులు నారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు పాల్గొన్నారు. కాగా, నారాయణ 8,47,50 డివిజన్లలోనూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్ల నియంతృత్వ పాలన సాగిందని నారాయణ విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కప్పిర శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆజాద్ సెంటర్‌లో పలువురు టీడీపీలో చేరారు. వారికి నారాయణ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, తాళ్లపాక అనూరాధ, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సింపోజియంలో 'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు (విద్య), మార్చి 20 : తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ సిపోజియంలో నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. కళాశాలలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు. యూనివర్సిటీ పోటీల్లో తమ కళాశాలకు చెందిన పలు విభాగాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో అవార్డులు సాధించారని చెప్పారు.

పరస్పర దాడులపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), మార్చి 20: పరస్పర దాడులు చేసుకున్న ఘటనలో నవాబుపేట పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... జీనిగలవీధికి చెందిన టీడీపీ కార్యకర్త దివ్యతేజకు ఆరో డివిజన్‌కు చెందిన ఆ పార్టీ నాయకుడు నరహరితో మనస్పర్థలున్నాయి. బుధవారం దివ్యతేజ తన స్నేహితుడు మల్లికార్జునతో కలిసి టీడీపీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ నరహరి ఉండటంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. నరహరిపై దివ్యతేజ చేయిచేసుకోవడంతో అక్కడున్న వారు ఇద్దరికి సర్దిచెప్పి పంపివేశారు. అనంతరం నరహరి అతని తమ్ముడు, స్నేహితుడు సునీల్ కలిసి దివ్యతేజపై దాడిచేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. ఈ ఘటనలపై ఇరువర్గాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాయి. పోలీసులు కేసులు నమోదు చేశారు.

కేవీ రత్నం మృతికి సంతాపం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 20 : రత్నం విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కేవీ రత్నం మృతికి ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ చైర్మన్ నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ వైస్ చైర్మన్ వీరిశెట్టి హజరత్ బాబు ఓ ప్రకటనలో సంతాపం వెలిబుచ్చారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

నోటి పరిశుభ్రతతో ఆరోగ్యం

నెల్లూరు (వైద్యం), మార్చి 20 : నోటి పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రముఖ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ మానస తెలియచేశారు. బుధవారం ప్రపంచ నోటి పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వేల్ఫేర్ అసోసియేషన్, మానస డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో డైకస్ రోడ్డులోని వియానీ హోంలో వైద్య శిబిరం నిర్వహించారు. నోటి పరిశుభ్రతపై వైద్యురాలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, విశ్రాంత ఏఎస్‌ఐ మహబూబ్ బాషా, వియానీ హోం నిర్వాహకులు సిస్టర్ రమ, జయ, వసుంధరాదేవి, పీహెచ్‌పీ నాయకులు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లిష్టమైన గుండె శస్త్రచికిత్స విజయవంతం


విలేకరుల సమావేశంలో రోగితో వైద్య నిపుణులు

నెల్లూరు (వైద్యం), మార్చి 20 : నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో అత్యంత క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ గుండె వైద్యనిపుణుడు సంజీవ్‌సురేష్ మాట్లాడుతూ కడప జిల్లాకు చెందిన ఏళ్ల పుల్లారెడ్డి(52) గుండె మంట, ఆయాసంతో ఆసుపత్రికి వచ్చారన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించగా గుండెకు రక్తం సరఫరా చేసే నరాలు ఎడమవైపు 90 శాతం, కుడివైపు 100 శాతం మూసుకు పోయాయన్నారు. ఈ నేపథ్యంలో అత్యవసరంగా బైపాస్ సర్జరీ చేయాలని నిర్ధారించామన్నారు. ఎంతో క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మత్తు వైద్య నిపుణుడు వెంకట రమణ చౌదరి పాల్గొన్నారు.

ఉప్పుటూరు సర్పంచి టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వారితో కోటంరెడ్డి సోదరులు

నెల్లూరు (వైద్యం), మార్చి 20 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ఉప్పుటూరు గ్రామ సర్పంచ్ వెంకట సుబ్బారెడ్డి టీడీపీలో చేరారు. ఆయనతోపాటు ఉప సర్పంచ్ బెల్లంకొండ వెంకట రత్నం, నలుగురు వార్డు సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్ సుధీర్‌రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి బుధవారం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యేల కార్యాలయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే సౌత్‌మోపూరు గ్రామానికి చెందిన అభిషేక్, శ్రీను మిత్రబృందం కూడా వైసీపీ నుంచి టీడీపీలో చేరింది. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చరిత్ర సృష్టిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వెడిచర్ల వెంకటేశ్వర్లు యాదవ్, రాపూరు పెంచలయ్య, వెంకట కృష్ణయ్య, పెంచల బాబు, అంబటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, రూరల్ మండలం ఆమంచర్లలో ఎమ్మెల్యే కోటంరెడ్డి సతీమణి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

శ్రీవారి తెప్పోత్సవాలు ప్రారంభం





పుష్కరిణిలో తెప్పపై సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి

తిరుమల, మార్చి20 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం శ్రీవారి తెప్పోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు.సాయంత్రం 6 గంటలకు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా మాడవీధుల గుండా ఆలయం పక్కనే వున్న పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. తొలిరోజు శ్రీరామచంద్రమూర్తి పుష్కరిణిలో తెప్పపై వేదం, గానం, నాదం మధ్య మూడుచుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు.ఈకార్యక్రమంలో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.కాగా గురువారం రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి పుష్కరిణిలో తెప్పపై విహరించనున్నారు.

అలిపిరి మార్గంలో ఎలుగుబంటి సంచారం



తిరుమల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):తిరుమలకు నడిచివెళ్లే అలిపిరి మార్గంలో మళ్లీ ఎలుగుబంటి సంచారం కలకలం సృష్టించింది.అలిపిరి మార్గం మధ్యలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సమీపంలో మంగళవారం రాత్రి 12.48 గంటల సమయంలో ఎలుగుబంటి కెమెరా ట్రాప్‌కు చిక్కింది.నడకమార్గం సమీపానికి వచ్చి వెళుతున్న ఎలుగుబంటిని చూసి అధికారులు ఉలిక్కిపడ్డారు. గతంలో ఇదే ప్రాంతంలోనే చిరుత పులులు, ఎలుగుబంట్లు కనిపించిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో నడిచి వచ్చే భక్తులను ఫారెస్ట్ అధికారులు అప్రమత్తం చేశారు.గాలిగోపురం నుంచి మోకాళ్లమిట్ట వరకు భక్తులను గుంపులుగా పంపారు. ప్రతి గుంపుతో ఇద్దరు విజిలెన్స్ సిబ్బందిని పంపడంతో పాటు చేతికర్రలను అందజేసి జాగ్రత్తగా పంపుతున్నారు. జనసంచారంలోకి ఎలుగుబంట్లు రాకుండా శబ్దాలు చేస్తున్నారు. టీటీడీ ఉన్నతాధికారులతో పాటు విజిలెన్స్, ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై భక్తులకు ప్రమాదం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని ఫారెస్ట్ అధికారులు మీడియాకు తెలిపారు. కొద్దిరోజులుగా ఓ చిరుతతో పాటు ఎలుగుబంట్లు నడకమార్గానికి కొంతదూరంలో సంచరిస్తున్నట్టు కెమెరాల్లో రికార్డయిందని, అయితే అవేవీ మెట్లవైపు రాలేదని తెలిపారు. అయినప్పటికీ భక్తులను కట్టుదిట్టమైన భద్రత నడుమ ముందుకు పంపుతున్నామని తెలిపారు.

జనసేన అభ్యర్థిని

మారుస్తారా?


పరిశీలనలో సుగుణమ్మ, ఊకా విజయకుమార్,తమ్మినేని వెంకటేశ్వర్లు

నేడోరేపో మళ్ళీ ఐవీఆర్ఎస్ సర్వేలు


జనసేన నేతలకు అధిష్ఠానం పిలుపు... నేడు నాగబాబుతో చర్చలు



సుగుణమ్మ



పవన్‌తో వెంకటేశ్వర్లు



ఊకా విజయకుమార్

తిరుపతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జనసేన అభ్యర్థిని మార్చే అవకాశాలున్నాయని ఆ పార్టీతో పాటు టీడీపీ వర్గాల్లో కూడా ప్రచారం మొదలైంది. ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వం పట్ల కూటమి పార్టీలకు చెందిన తిరుపతి నాయకులు వ్యతిరేకత కనబరుస్తున్న నేపథ్యంలో జనసేన అధిష్ఠానం పునరాలోచనలో పడినట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తాజా పరిణామాలతో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ,గేట్ కళాశాలల కరస్పాండెంట్ తమ్మినేని వెంకటేశ్వర్లు, ఊకా విజయకుమార్ పేర్లు ప్రచారంలోకి వచ్చాయి.మరోవైపు అధిష్ఠానం తిరుపతిలో పార్టీ నాయకుల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు రంగంలోకి దిగింది. అందులో భాగంగా పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు నుంచీ తిరుపతి నేతలకు పిలుపు వచ్చింది.తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్, నగర కమిటీ అధ్యక్షుడు రాజారెడ్డి, ఉపాధ్యక్షులు మధుబాబు, బాబ్జి, వార్డుల అధ్యక్షులు రాజేశ్ ఆచారి, మునస్వామి, సాయి యాదవ్, మణికంఠ, మహిళా నేతలు సుభాషిణి, ఆకుల వనజ, హేమలత తదితరులకు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి రావాలని కబురందినట్టు సమాచారం.

తిరుపతి జనసేన అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులును ప్రకటించడంతో ఆయన స్థానికేతరుడని జనసేన, టీడీపీ నేతలు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. మిత్రపక్షమైన బీజేపీ నేతలు కూడా ఆయనకు మద్దతుగా రావడం లేదు. బయటి వారికి టికెట్ ఇస్తే సహకరించేది లేదని, స్థానికంగా వున్న ఎవరికి ఇచ్చినా వారి గెలుపుకోసం పనిచేస్తామని వీరు చెబుతున్నారు. ఇలా మూడు పార్టీల నాయకుల నుంచీ వ్యతిరేకత రావడంతో జనసేన అధిష్ఠానం అభ్యర్థి మార్పు గురించి ఆలోచిస్తున్నట్టు సమాచారం.అభ్యర్థిని మార్చే క్రమంలో ఒకటి రెండు రోజుల్లో ఆశావహుల పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వేలు నిర్వహించేందుకు నిర్ణయించినట్టు జనసేన వర్గాలు చెబుతున్నాయి.గురువారం మంగళగిరికి వెళ్ళనున్న తిరుపతి జనసేన నాయకులతో అధినేత మాట్లాడతారా లేక ఆయన తరపున నాగబాబు గానీ నాదెండ్ల మనోహర్ గానీ మాట్లాడతారా అన్నది చూడాల్సి వుంది. దానితో పాటు ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు సహకరించాల్సిందిగా కోరతారా లేక ప్రత్యామ్నాయం గురించి ఆరా తీస్తారా అన్నది చూడాల్సి వుంది.





గుంతలో పడివున్న వాహనాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

మృతుడు రుక్మాంగదరెడ్డి (ఫైల్ ఫొటో)

మున్సిపల్ నిర్లక్ష్యానికి

నిండుప్రాణం బలి

చింతలగుంటలో పార్కు ఏర్పాటు పనులు

పునాదుల కోసం తీసిన గోతిలో పడి ఒకరు మృతి

పుత్తూరు అర్బన్, మార్చి 20:పుత్తూరు మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగ అధికారుల నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైంది.నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో జరుగుతున్న పనులకు సంబంధించి కనీస భద్రతా చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు నిర్లిప్తంగా వ్యవహరించడంతో ఒక కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది.వివరాల్లోకి వెళితే... పుత్తూరు పట్టణానికి చెందిన రుక్మాంగదరెడ్డి(55) లక్ష్మీనగర్‌లో నివాసముంటున్నాడు.బుధవారం మధ్యాహ్నం పట్టణంలోకి వెళ్లి చింతలగుంట మీదుగా ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తున్నాడు.ఈ క్రమంలో మున్సిపల్ పార్కు ఏర్పాటు కోసం ప్రహరీగోడ నిర్మాణంలో భాగంగా తీసిన పునాదుల గుంతలో ప్రమాదవశాత్తూ పడ్డాడు. ద్విచక్ర వాహనం మీద పడడంతో స్పృహ కోల్పోయాడు.అక్కడే పనుల్లో ఉన్న కూలీలు రుక్మాంగదరెడ్డిని బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు లేకపోవడంతో పోలీసు కేసు నమోదు కానట్లు తెలిసింది. చింతలగుంట ఉన్న ప్రదేశంలో విద్యాసంస్థలుండడంతో రద్దీగా ఉంటుంది. ఇదేదారిలో వందలాది మంది విద్యార్థులు, స్థానికులు వెళుతుంటారు. రోడ్డుకు ఆనుకుని పునాదులు తీస్తుండడంతో భద్రతా చర్యలు తీసుకోవాలనే కనీస ఇంగితం కూడా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగానికి లేకపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం ఇదే పునాదుల గుంతలో కుక్కపిల్ల పడిపోయింది. దానిని బయటకు తీసే క్రమంలో టీడీపీ నాయకుడు షణ్ముగరెడ్డికి, మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి అనుచరుడికి మధ్య జరిగిన దాడి, పోలీసు ఫిర్యాదులు, కేసుల నమోదు వరకు వెళ్లింది. ఆ సంఘటనతోనైనా అధికారులు మేలుకొని ఉండాల్సింది. పునాదుల కోసం తీసిన గుంతల వద్ద బారికేడ్ల ఏర్పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వుంటే బుధవారం ఒక వ్యక్తి మృతి చెందాల్సిన పరిస్థితి ఉండేది కాదనే మాటలు వినబడుతున్నాయి. మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగం తొలి నుంచి ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉంది. అభివృద్ధి పనుల పర్యవేక్షణను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి అప్పగించేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన అన్ని వైపుల నుంచి విమర్శలు రావడంతో మున్సిపాలిటీ దిద్దుబాటు చర్యలు తీసుకుంది. హడావిడిగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేసింది.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



అధికారులు స్వాధీనం చేసుకున్న సీఐటీయూ కార్యాలయం

విధుల్లో మద్యం తాగిన

రుయా ఉద్యోగి సస్పెన్షన్

- బార్‌లా మార్చిన సీఐటీయూ కార్యాలయం స్వాధీనం

తిరుపతి(వైద్యం), మార్చి 20 : తిరుపతి రుయాస్పత్రి ఆవరణలో విధుల్లో ఉన్న సమయంలోనే మద్యం తాగిన ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ రవిప్రభు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.రుయాస్పత్రి ఆవరణలో సీఐటీయూ అనుబంధ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నాలుగు రోజుల కింద వాటర్‌మ్యాన్ నాంపల్లి సుబ్రహ్మణ్యం మరో వ్యక్తితో కలిసి విధుల్లో ఉన్న సమయంలోనే మద్యం సేవిస్తూ అధికారులకు పట్టుబడ్డాడు.ఈ విషయంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో స్పందించిన సూపరింటెండెంట్ రవిప్రభు పూర్తిస్థాయిలో విచారించాలని ఏఆర్ఎంవో హరికృష్ణను ఆదేశించారు. ఆయన విచారణలో మద్యం సేవించింది వాస్తవమే అని తేలడంతో వాటర్‌మ్యాన్ నాంపల్లి సుబ్రహ్మణ్యాన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలోనూ పలుమార్లు ఇక్కడే మద్యం తాగుతూ అధికారులకు పట్టుబడి సంజాయిషీ నోటీసులు కూడా రాసిచ్చినట్లు ఆయన గుర్తించారు.దీంతో విధుల్లో మద్యం సేవించిన సుబ్రహ్మణ్యాన్ని సస్పెండ్ చేయడమే కాకుండా మద్యం సేవించేందుకు అడ్డాగా మార్చుకున్న యూనియన్ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఉద్యోగులు ఎవరైనా విధుల్లో ఆలసత్వం వహించినా, క్రమశిక్షణ పాటించక పోయినా చర్యలు తప్పవని ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రవిప్రభు హెచ్చరించారు.

యూనియన్ నుంచి సుబ్రహ్మణ్యం బహిష్కరణ



యూఎంహెచ్ఈ నూతన అధ్యక్షుడు మునిచంద్ర

యూఎంహెచ్ఈ యూనియన్ కార్యాలయంలో మద్యం సేవించడాన్ని సీఐటీయూ తీవ్రంగా భావించి సుబ్రహ్మణ్యాన్ని యూనియన్ అధ్యక్ష పదవి నుంచి తప్పించడంతోపాటు సంఘం ప్రాథమిక సభ్యత్వం నుంచి కూడా బహిష్కరించినట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ నేతలతో కలిసి అత్యవసర సమావేశాన్ని నిర్వహించి సుబ్రహ్మణ్యాన్ని యూనియన్ నుంచి బహిష్కరించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఆయన స్థానంలో నూతన అధ్యక్షుడిగా జి.మునిచంద్రను ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.ప్రధాన కార్యదర్శి నరసింహులు, కార్యదర్శి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో చెడ్డీగ్యాంగ్ కలకలం

నాగలాపురం, మార్చి 20: నాగలాపురంలో చెడ్డీగ్యాంగ్ కలకలం సృష్టించింది. మంగళవారం రాత్రి సుమారు 22, 25యేళ్ల వయసు కలిగిన ఇద్దరు చెడ్డీలు ధరించి తిరుగుతుండగా గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గమనించారు. వారిని వెంబడిస్తుండగా పారిపోయారు.పట్టణంలో పలుచోట్ల చెడ్డీగ్యాంగ్ తిరుగుతున్న దృశ్యాలను సీసీటీవీ ఫుటేజ్‌ద్వారా పోలీసులు గుర్తించారు. సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల ప్రజలను అప్రమత్తంచేస్తూ ఎవరూ ఆందోళన చెందవద్దని బుధవారం రాత్రి సీఐ దివాకర్ రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు.గట్టినిఘా ఏర్పాటు చేశామని, పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.



చంద్రగిరి మండలం ఎ.రంగంపేట వద్ద భువనేశ్వరికి స్వాగతం

తిరుమలలో నారా లోకేష్

కుమారుడు దేవాన్ష్ పేరిట శ్రీవారి భక్తులకు నేడు అన్నదానం



టీడీపీ నేతలతో లోకేష్ మాటామంతి

తిరుమల, మార్చి20(ఆంధ్రజ్యోతి):టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఏటా తన మనవడు దేవాన్ష్ జన్మదినాన తిరుమలలో ఒకరోజు అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం అందజేస్తున్న విషయం తెలిసిందే.ఇందులో భాగంగా గురువారం దేవాన్ష్ పుట్టిన రోజు కావడంతో ఇప్పటికే రూ.38 లక్షలు నారా కుటుంబం టీటీడీకి విరాళాన్ని అందజేసింది.మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలో జరిగే అన్నప్రసాదాల వితరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు నారా లోకేశ్ , భార్య బ్రహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు.రాయచోటి మండలంలో నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తల్లి నారా భువనేశ్వరి అంతకుముందే తిరుమల చేరుకున్నారు. గాయత్రి నిలయం అతిథిగృహం వద్ద టీటీడీ రిసెప్షన్ అధికారులు భాస్కర్, సత్రేనాయక్, ఎమ్మెల్సీ అనురాధ, టీడీపీ నాయకులు అమరనాథ రెడ్డి, నరసింహయాదవ్, మురళీమోహన్, శ్రీధర్‌వర్మ, రవినాయుడు,రాజుయాదవ్, కేశవులు, భాస్కర్‌వర్మ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి లోకేశ్ శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనానికి చేరుకుని భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేయనున్నారు.ఉదయం 10.30 గంటలకు తిరుమల నుంచి తిరుగు ప్రయాణమవనున్నారు.

బాణసంచా కేంద్రం పేలుడులో

గాయపడిన ఇద్దరి మృతి

సూళ్లూరుపేట, మార్చి 20:బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో గాయపడిన ఆరుగురిలో ఇద్దరు మృతి చెందారు. సూళ్లూరుపేట పట్టణం జాతీయ రహదారి పక్కనే వట్రపాలెం సమీపంలో ఉన్న బాణసంచా తయారీ, విక్రయ కేంద్రంలో మంగళవారం పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నై కేఎంసీ వైద్యశాలకు తరలించారు.శరీరం 90 శాతానికి పైగా కాలిపోయిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ (18), రవి (21) బుధవారం రాత్రి మృతి చెందారు. వీరిద్దరూ టపాసుల తయారీ కేంద్రంలో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరితోపాటు తీవ్రంగా గాయపడిన వట్రపాలేనికి చెందిన శివకుమార్ పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు ఎస్ఐ రహీం రెడ్డి తెలిపారు.

ప్లాస్టిక్ గోడౌన్ దగ్ధం

- విద్యుదాఘాతంతో రూ.1.25 కోట్ల ఆస్తి నష్టం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాళహస్తి, మార్చి 20:శ్రీకాళహస్తి పట్టణ శివారులోని బైపాస్ రోడ్డు వద్ద స్కిట్ కళాశాల సమీపంలో ఓ ప్లాస్టిక్ గోడౌన్ దగ్ధమైంది.విద్యుదాఘాతం కారణంగా అగ్నిప్రమాదం సంభవించడంతో బుధవారం వేకువ జామున ఈ ఘటన జరిగింది. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన జయరాం ప్లాస్టిక్ ముడిసరుకు వ్యాపారం చేస్తుంటాడు.కూల్ డ్రింక్ తయారీ కంపెనీలకు ప్లాస్టిక్ బాటిల్ తయారీ ముడిసరుకుతో పాటు పలు ద్రావకాలను సరఫరా చేస్తుంటాడు. ఇందుకోసం స్కిట్ కళాశాల సమీపంలో గోడౌన్ ఏర్పాటు చేసుకుని సరుకులు నిల్వ చేసుకునేవాడు. మంగళవారం రాత్రి గోడౌన్‌లో సరుకులతో పాటు, ఓ ట్రాక్టర్ ట్రాలీని కూడా ఉంచి తాళం వేసుకొని ఇంటికి వెళ్లాడు. వేకువజామున నాలుగు గంటల సమయంలో షార్టు సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. కాసేపటికి గోడౌన్ నుంచి మంటలు పెద్దఎత్తున ఎగసిపడ్డాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. శ్రీకాళహస్తి, నాయుడుపేట నుంచి రెండు అగ్నిమాపక వాహనాలు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్లాస్టిక్ ముడి పదార్థం కావడంతో మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. సమీపంలో పలు వ్యాపార సంస్థలు ఉన్నాయి. వాటికి మంటలు వ్యాపించకుండా సకాలంలో కట్టడి చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య ఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.125 కోట్లు ఆస్తి నష్టం జరిగినట్లు ధృవీకరించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం): సా. 6.27

సహరి (శుక్రవారం) : ఉ. 4.57

పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకలదే కీలకపాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో శామ్యూల్

సూళ్లూరుపేట, మార్చి 20: పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకలు కీలకపాత్ర పోషిస్తున్నాయని డీఎఫ్‌వో శామ్యూల్ అన్నారు. అటవీశాఖ, వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో అట్టకానితిప్పలోని పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, ప్రస్తుతం వాటి సంఖ్య తగ్గిపోయి అంతరించిపోయే పరిస్థితి నెలకొందన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జంతు శాస్త్ర విభాగాధిపతి శ్రీనివాస్ మాట్లాడుతూ పిచ్చుకల సంఖ్య తగ్గిపోవడానికి ప్రధాన కారణం పంటలకు పురుగు మందులతో పాటు రసాయనిక ఎరువుల వాడకం, సెల్‌ఫోన్ల వల్ల కలిగే రేడియేషన్ కూడా కారణమన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ రాజేంద్రప్రసాద్, సెక్షన్ ఆఫీసర్ ప్రకాష్, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరుమూరుకు నారా భువనేశ్వరి



వెంకటస్వామి (ఫైల్‌ఫొటో)

వాకాడు, మార్చి 20: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 22న శుక్రవారం వాకాడు మండలంలోని తిరుమూరు గ్రామానికి రానున్నారు. గ్రామానికి పిడుగు వెంకటస్వామి(61) గతేడాది సెప్టెంబరు 14న చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని నారా భువనేశ్వరి శుక్రవారం పరామర్శించనున్నారు. సన్నకారు రైతు అయిన వెంకటస్వామి టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. 2020లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తిరుమూరు వార్డు సభ్యుడిగా విజయం సాధించారు.

టీడీపీలో పలువురి చేరిక



టీడీపీలో చేరిన వారితో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 20: మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన పలువురు బుధవారం టీడీపీలో చేరారు. వారికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరూ సమిష్టిగా పనిచేసి ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు కూటమి అధికారంలోకి వస్తే చేపట్టనున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ టీడీపీలో చేరిన వారికి సముచితస్థానం కల్పిస్తామన్నారు నెల్లూరులోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో అల్లూరు కరుణాకర్‌రెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వెంకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రహంతుల్లా, పల్లంపర్తి మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోండి



చెన్నూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, పారా మిలటరీ సిబ్బంది

గూడూరు, మార్చి 20: రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చెన్నూరు, విందూరు గ్రామాల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పారామిలటరీ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా వారిలో ధైర్యం నింపేందుకు పారామిలటరీ సిబ్బందితో కవాతు నిర్వహించామన్నారు. ఓటర్లను ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా, ప్రలోభాలకు గురిచేసినా కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. ఇప్పటికే పాత నేరస్థులను, రౌడీషీటర్లను బైండోవర్ చేసుకోవడం జరిగిందన్నారు. ఓటర్లందరూ ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, పారామిలటరీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

చిల్లకూరు, మార్చి 20: ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సెక్టార్, ఫ్లైయింగ్‌స్క్వాడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకూడదన్నారు. కోడ్ నియమావళి పూర్తయ్యే వరకు ఎలాంటి ప్రభుత్వ పథకాల పంపిణీలో పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది కోడ్‌ను ఉల్లఘించి రాజకీయ సభలు, సమావేశాల్లో పాల్గొంటే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాలలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. బీఎల్‌వో ఈవీఎంలపై అవగాహన కలిగివుండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, ఫ్లైయింగ్‌స్క్వాడ్ అధికారి శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీవోకు చెక్‌పోస్టు సిబ్బంది అటాచ్

తడ, మార్చి 20: రవాణాశాఖ చెక్‌పోస్టును మూసివేయడంతో అక్కడి సిబ్బందిని గూడూరు ఆర్టీవోకు అటాచ్ చేశారు. శనివారం సాయంత్రం చెక్‌పోస్టు రవాణాశాఖ కార్యాలయాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. దీంతో కార్యాలయంలోని రికార్డులు, పరికరాలు, ఇతర వస్తువులన్నింటినీ గూడూరు, నెల్లూరుకు తరలించారు. అక్కడ సిబ్బందిని గూడూరు ఆర్టీవో ఆఫీసుకు అటాచ్ చేస్తున్నట్లు రవాణాశాఖ అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

గూడూరు, మార్చి 20: కండలేరు డ్యామ్ నుంచి మంచి నీటిని సరఫరా చేసే పైపులైన్ల మరమ్మతుల కారణంగా గూడూరు పట్టణంలో గురు, శుక్రవారాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు.

ఐదుగురి బైండోవర్

బాలాయపల్లి, మార్చి 20: మండలంలోని జయంపు, పిగిలాం, మన్నూరు, నిండలి, గొల్లగుంట గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్న ఐదుగురిని ఎస్ఈబీ అధికారులు బుధవారం పట్టుకుని తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

కోట, మార్చి 20: మండల పరిధిలోని మద్దాలి, కేశవరం, మద్దాలి కండ్రిగ, చిట్టేడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో శంకరయ్య, తహసీల్దారు నాగరాజరావు బుధవారం తనిఖీ చేశారు. సచివాలయాలు, ఆర్‌బీకేల్లో రాజకీయ నేతల ఫ్లెక్సీలు, సంక్షేమ పథకాల పోస్టర్లు తొలగించారు. శిలాఫలకాలకు పేపర్లను అంటించారు.

శిథిలావస్థలో అంగన్వాడీ భవనాలు



ఉడతావారిపార్లపల్లిలో శిథిలమైన అంగన్వాడీ కేంద్రం - చిల్లకూరులో అద్దెభవనం బయట చిన్నారులు - బల్లవోలులో నిర్మాణంలో భవనం

చిల్లకూరు, మార్చి 20: చిల్లకూరు మండలంలో పలు అంగన్వాడీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో చిన్నారులు, అంగన్వాడీలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 85 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 14 అద్దె భవనాల్లో సాగుతున్నాయి. చాలా భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా, నాడు-నేడు పథకం కింద రెండంటే రెండు భనాలు మాత్రమే మంజూరు చేశారు. అవి రెండేళ్లయినా నిర్మాణం పూర్తికాలేదు. చిల్లకూరు, నల్లయ్యగారిపాళెం, తిక్కవరం, ఉడతావారిపార్లపల్లి, కృష్ణాపురం, రైటాసత్రం, అల్లీపురం, పునుగుంట పాళెం, పల్లెవానిదిబ్బ, ఏరూరు, బల్లవోలు, బల్లవోలు ఎస్టీకాలనీ, చింతవరం, బూదనం అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. 2022లో నాడు-నేడు పథకంలో బల్లవోలు, చింతవరం కేంద్రాలకు శాశ్వత భవనాలు మంజూరు చేశారు. రెండు సంవత్సరాలయినా ఇప్పటికీ వాటి నిర్మాణాలు పూర్తికాలేదు. ఇక శాశ్వత భవనాల్లో చాలా వరకు శిథిలావస్థలో ఉన్నాయి. కొన్నింటికి గాలి వెలుతురు కూడా సరిగా రాదు. వసతులూ సరిగా లేకపోవడంతో చిన్నారులు, అంగన్వాడీలు అవస్థలు పడుతున్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గొప్పలు చెప్పూ ప్రభుత్వ ఆచరణలో అమలు చేయడంలేదని చిన్నారుల తల్లిదండ్రులు అంటున్నారు.

ధాన్యం నిల్వ... రైతులకు భారం

- బస్తాపై రూ.3 వసూలు
- వడ్డీలేని రుణాలు బంద్



వ్యవసాయ మార్కెట్ గోదాము

వాకాడు, మార్చి 20: పెట్టుబడి కోసం అప్పులు తెచ్చి... ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకోవడం రైతులకు భారంగా మారింది. వాకాడు వ్యవసాయ మార్కెట్ గోదాములో ధాన్యం దాచుకోవాలంటే ఎన్నడూలేని విధంగా ఒక్కొక్క బస్తాపై నెలకు రూ.3 చొప్పున చెల్లించాల్సి ఉండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు 2012లో రూ.37 లక్షల వ్యయంతో 600మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల వ్యవసాయ మార్కెట్ గోదామును వాకాడులో నిర్మించారు. అప్పటి నుంచి బస్తా ధాన్యం ఎంతకాలం నిల్వ చేసినా 30 పైసలు మాత్రమే వ్యవసాయ మార్కెట్ కమిటీ వసూలు చేసేది. టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల్లో ధాన్యాన్ని నిల్వచేస్తే రైతులకు వడ్డీలేని రుణం రూ.2 లక్షలు ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వడ్డీలేని రుణాలు ఇవ్వడం ఆపేశారు. నెలన్నర నుంచి ఒక్కొక్క బస్తా ధాన్యం నిల్వ చేయాలంటే నెలకు రూ.3 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ లెక్కన 50 బస్తాలు నిల్వ చేయాలంటే నెలకు రూ.150 అవుతుంది. ఒకేసారి పది రెట్లు పెంచేయడంతో రైతులపై అధిక భారం పడుతోంది. ఇంత ధరలు వెచ్చించి ధాన్యాన్ని నిల్వచేయడానికి రైతులు సముఖత చూపడం లేదు. అదే ప్రైవేటు గోదాముల్లో పుట్టు ధాన్యం(860) ఎన్ని రోజులు నిల్వ చేసుకున్నా మాత్రమే రూ.400 తీసుకుంటున్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు ధాన్యాన్ని ప్రైవేటు గోదాముల్లో భద్రపరుచుకుంటున్నారు. రైతులకు అందాల్సిన పథకాలను అటకెక్కించడమే కాకుండా ధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు అధిక భారం మోపడం పట్ల అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దళితుల జోలికివస్తే... దీటుగా ఎదుర్కొంటాం: నెలవల



టీడీపీలోకి చేరిన వారిలో విజయశ్రీ తదితరులు

నాయుడుపేట టౌన్, మార్చి 20: నియోజకవర్గంలో వైసీపీ నేతలు దళితుల జోలికివస్తే దీటుగా ఎదుర్కొంటామని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత కొండేపాటి గంగాప్రసాద్ సమక్షంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ ఆధ్వర్యంలో బుధవారం భారీ సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు వైసీపీ నేతలు సహకరించాలే తప్ప ప్రలోభాలకు గురిచేయడం సబబుకాదన్నారు. పెళ్లకూరు మండలంలో వైసీపీ సీనియర్ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి దళితుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, టీడీపీ కార్యకర్తలతో కలసి చిల్లకూరులో ఆయన నివాసాన్ని ముట్టడించేందుకు కూడా వెనుకాడబోమని నెలవల హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే సంజీవయ్య ప్రతిపక్షానికి చెందిన కౌన్సిలర్లు నామినేషన్ వేయకుండా బ్లాక్‌మెయిల్ చేసి ప్రలోభాలకు గురిచేయడమే కాకుండా హక్కులను కాలరాశారని విమర్శించారు. వైసీపీలో కష్టపడినప్పటికీ ఎమ్మెల్యే సంజీవయ్య ఇబ్బందుకు గురిచేయడంతో తాను టీడీపీలో చేరానని చెప్పారు. అందరం కలసికట్టుగా పనిచేసి విజయశ్రీని గెలిపించుకుందామని అన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో సీనియర్ నేత కొండేపాటి గంగాప్రసాద్ మాట్లాడుతూ టీడీపీలో చేరిన రఫీకి పార్టీలో సముచితస్థానం కల్పించడంతోపాటు, అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. వైద్య వృత్తిని వదిలి ప్రజాసేవకోసం రాజకీయాల్లోకి వచ్చిన నెలవల విజయశ్రీని ఆశీర్వదించాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడటమే కాకుండా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకపోవడంతో పక్కరాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సి వస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, పసల గంగాప్రసాద్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు మధునాయుడు, అత్తికాయల సుబ్రహ్మణ్యం, గూడూరు ప్రభావతమ్మ, దార్ల రాజేంద్ర, సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, కిషోర్ తదితరులు ఉన్నారు.

బీసీలను విస్మరించారు: డాక్టర్ మస్తాన్ యాదవ్

వెంకటగిరి, మార్చి 20: వెంకటగిరి నియోజకవర్గంలో 68శాతం వున్న బీసీలకు టికెట్ ఇవ్వక పోవడం వారిని విస్మరించడమే అని టీడీపీ కార్యదర్శి డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్ రాష్ట్ర అన్నారు. బుధవారం రాపూరు క్రాస్‌రోడ్డులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, వెంకటగిరి అభ్యర్థి విషయంలో పార్టీ నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడిన కురుగొండ్ల రామకృష్ణకు టికెట్ ఇచ్చినా, ఆయన గెలుపుకోసం తాను సంతోషంగా పనిచేసే వాడినని అన్నారు. స్థానికేతరులైనవారి సిఫారసుతో టికెట్ కేటాయించడం ఏమిటన్నారు. పార్టీ అధిష్ఠానం తనను పిలిచి మాట్లాడిన తర్వాత భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించుకుంటానని చెప్పారు. కాగా, డాక్టర్ మస్తాన్ యాదవ్‌ను మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కలిశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియ విజయానికి కృషి చేయాలని కోరారు.

బీసీలకు న్యాయం చేయాలి

వెంకటగిరి, మార్చి 20: కులగణన చేయకపోవడం వల్ల బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శకరరావు అన్నారు. బుధవారం రాపూరు క్రాస్ రోడ్డులో ఉన్న డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటగిరి నియోజకవర్గంలో 68 శాతం ఉన్న బీసీ సామాజికవర్గానికి చెందిన టికెట్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.

కోనేటిమిట్టలో సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న డాక్టర్ రోహిణి

గూడూరు అర్బన్, మార్చి 20: స్థానిక కోనేటిమిట్టలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్రమహిళా మండలి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెలా వైద పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో విష్ణువందన, స్నేహలత, నిర్మల, లక్ష్మి, శశికళ, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, శిశు మరణాల తగ్గింపే పోషణ్ పక్వాడా లక్ష్యం

బాలాయపల్లి, మార్చి 20: స్త్రీశిశు మరణాల తగ్గింపే పోషణ్ పక్వాడా లక్ష్యమని అంగన్వాడీ పర్యవేక్షకురాలు రాజేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని జయంపు గ్రామంలో బాలింతలు, గర్భిణులకు పోషకారాలపై కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని చిట్టెడు, కేశవరం, సిద్ధమ్మకండ్రిగ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాలు జరిగాయి. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై అంగన్వాడీ వర్కర్లు అవగాహన కల్పించారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించేవరకు తీసుకోవాల్సిన పోషకాల గురించి వివరించారు.

నారా లోకేశ్‌ను కలిసిన విజయశ్రీ



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయశ్రీ

నాయుడుపేట టౌన్, మార్చి 20: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమల పర్యటన నిమిత్తం బుధవారం రాత్రి తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ముస్లిం మహిళలకు చీరల పంపిణీ

గూడూరు అర్బన్, మార్చి 20: రంజాన్ పండుగను ముస్లింలందరూ ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. బుధవారం స్థానిక షాదీమంజిల్‌లో ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మత సామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీక అన్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు మగ్దూమ్, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బొమిడి శ్రీనివాసులు, బాబురెడ్డి, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అరవిందుల తత్వాన్ని అవగాహన చేసుకోవాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 20: అరవిందుల తాత్వికతను ఈతరం అవగాహన చేసుకోవాల్సిన అవసరముందని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి పేర్కొన్నారు. అరబిందో సొసైటీ - ఉమెన్ స్టడీస్ విభాగం సంయుక్తంగా అరబిందోపనిషద్ అంశంపై పద్మావతి వర్సిటీలో బుధవారం ఒక్కరోజు జాతీయ సదస్సు నిర్వహించాయి. ముఖ్య అతిథిగా వీసీ పాల్గొని మాట్లాడుతూ అరబిందుల తత్వంలో ఈ తరానికి ఉపయోగపడే అనేక విలువలున్నాయని తెలిపారు. అరబిందో సంస్థ ప్రతినిధి ములుగు శ్రీనివాసులు మాట్లాడుతూ అరవిందుల సూచించినట్టు సనాతన ధర్మ మార్గంలో యువత తమను తాము తీర్చిదిద్దుకోవాలని కోరారు. అరబిందో సొసైటీ ప్రతినిధి రంగనాథం మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయి విద్యార్థులకు అరవిందుల గురించి తెలియజేసే లక్ష్యంతో ఈ సదస్సు చేపట్టామన్నారు. ప్రొఫెసర్ కాత్యాయని మాట్లాడుతూ ధ్యానం, యోగా ద్వారా మనిషి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ సుభాషిణి, డాక్టర్ నాగరజని, డాక్టర్ యువశ్రీ, డాక్టర్ నీరజ పాల్గొన్నారు.

ఎన్నికల విధులను విస్మరిస్తే చర్యలు: ఆర్డీవో



అధికారులతో సూచనలు ఇస్తున్న ఆర్వో చంద్రముని

సూళ్లూరుపేట, మార్చి 20: ఎన్నికల విధులను విస్మరిస్తే చర్యలు తప్పవని ఆర్వో(ఆర్డీవో) చంద్రముని హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాయంలో పోలింగ్ అధికారులతో పాటు, ఏపీవోలకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అందరూ తప్పకుండా పాటించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబధించి పోలింగ్‌లో పాల్గొనే అధికారులకు గురువారం స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, అందరూ తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కేవీ గోపాలకృష్ణ, ఇక్బాల్, ప్రసాదరావు, డీటీలు గోపినాథ్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పై విస్తృత ప్రచారం



గొల్లపాళెం మహిళలతో పాశం సునీల్‌కుమార్

వాకాడు, మార్చి 20: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని గొల్లపాళెంలో టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ.1500 నగదు ఇస్తారన్నారు. అలాగే రైతులకు రూ.20వేలు పెట్టుబడి నిధి, తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15వేల నగదు తదితర పథకాలను అమలు చేస్తుందన్నారు. రెండు నెలల్లో టీడీపీ ప్రభుత్వం వస్తుందని ప్రతి ఒక్కరు మద్దతు పలకాలని కోరారు. వైసీపీ నేతలు ఇసుక, సిలికా, మద్యం అమ్మకాల ద్వారా వేల కోట్లు దోచుకుంటున్నారే తప్ప అభివృద్ధి గురించి పట్టించుకోవడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, మద్దాలి సర్వోత్తమరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, షేక్ జలీల్ అహ్మద్, తుమ్మల మోహన్‌నాయుడు, కుంచం దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీ విజిల్‌పై ప్రజలకు అవగాహన కల్పించండి

తడ, మార్చి 20: ఎన్నికల నేపథ్యంలో జరిగే అక్రమాలను సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకురావచ్చని, ఆ మేరకు ఓటర్లకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందిని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అళఘునాధస్వామి ఆలయంలో ధ్వజారోహణం



ధ్వజారోహణం కార్యక్రమంలో భక్తులు

గూడూరు, మార్చి 20: స్థానిక అళఘునాధస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ గరుడచిత్రపటాన్ని ధ్వజస్థంభంపై ఎగురవేసి సంప్రదాయబద్ధంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు కొడిముద్దలు అందించడంతో భక్తులు వాటిని అందుకునేందుకు పోటీపడ్డారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

సీ విజిల్ ఫిర్యాదులపై సత్వరం స్పందించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 20: సీ విజిల్‌లో అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, వంద నిమిషాల్లోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నోడల్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎంసీసీ ఉల్లంఘనలు ఎట్టి పరిస్థితిలోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో అధికారులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి లిక్కరు, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కులశేఖర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.